# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక

సంపుటి: 11 సంచిక: 353 మంగళవారం 15-07-2025 పేజీలు: 08 వెల రూ. 3 www.epaperjournalistdiary.com


## లార్డ్స్ టెస్టు.. పోరాడి ఓడిన భారత్



7లో..

## మరోసారి ఢిల్లీ బాట..

- మరోసారి ఢిల్లీ పర్యటనకు ఏపీ సీఎం చంద్రబాబు..
- నేడు ఉదయం అమరావతి నుంచి ఢిల్లీ చేరుకోన్న సీఎం..
- మూడు రోజుల పాటు కొనసాగనున్న పర్యటన..



6

## ఎడ్యుటెక్ కంపెనీల కట్టడి ఎలా?

- స్కిల్స్ పేరుతో యూనివర్సిటీల్లో క్లాసులు
- అది చట్ట విరుద్ధమంటూ మండలి నోటీసులు
- ఇది మీ పరిధిలోకి రాదంటూ సంస్థల సమాధానం



2

## కల్తీ కల్లు దందాలో సిండికేటు!..

- నెలకు రూ.50 కోట్లకు పైగా కల్తీ వ్యాపారం?
- 5 జిల్లాల్లో చక్రం తిప్పుతున్న అనధికార వ్యవస్థ
- హైదరాబాద్ శివారు జిల్లా ముఖ్యనేతే కీలకం
- ఆయన అండతోనే రెచ్చిపోతున్న అనుచరులు
- పాడిని లిక్విడ్‌గా మార్చి రాష్ట్రమంతా సరఫరా!
- కేపీహెచ్‌బీలో వికటించిన లిక్విడ్ ప్రయోగం?
- ఎక్సైజ్ అధికారులనూ మేనేజ్ చేస్తున్న నెట్‌వర్క్
- మాఫియా ధోరణిపై గౌడ సంఘాల ఆందోళన

4



## హైదరాబాద్ క్రికెట్‌లో రాజకీయల హవా..

- హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావుతో పాటు కీలక వ్యక్తులు అరెస్ట్
- క్లబ్బులపై కొంతమంది కింగ్‌పిన్స్ నియంత్రణ.. ప్లేయర్ల ఎంపికపై డబ్బు రాజకీయాలు
- టాలెంట్‌ను నిర్లక్ష్యం చేసి రాజకీయ, ఆర్థిక లాభాల కోసం క్రికెట్‌ను పాడుచేస్తున్న నిర్వాహకులు

2

## కృష్ణా, గోదావరి బేసిన్లో సమస్యలపై చొరవచూపాలి

- పాలమూరు-రంగారెడ్డి, డిండి లిఫ్ట్ ల క్లియరెన్స్ రాలేదు
- ఈ ప్రాజెక్టుల డీపీఆర్లను కేంద్ర జల సంఘం ఆమోదించాలి
- సీసీకు ఈసీ జారీ చేయమని సిఫార్సు చేయాలి
- ఏపీ కృష్ణా జలాల మళ్లింపుపై నియంత్రణలు విధించాలి
- ఇచ్చంపల్లి ప్రాజెక్ట్‌కు కేంద్రం నిధులు మంజూరుచేయాలి
- కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కు ఉత్తమ్ లేఖ

5



## రిజర్వేషన్ల చుట్టూ రాజకీయం


- స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా రాష్ట్రంలోని రాజకీయ పక్షాల ఎత్తులు
- బీసీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని చెప్పుకునే ప్రయత్నంలో అధికార కాంగ్రెస్
- అసెంబ్లీలో బిల్లు మొదలు ఆర్డినెన్స్ వరకు రిజర్వేషన్ల అంశాన్ని ఉపయోగించుకునే వ్యూహం
- రాష్ట్రపతి వద్ద బిల్లు ఆమోదానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలేంటని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలు
- అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు ఎందుకు తీసుకెళ్లలేదని నిలదీస్తున్న వైనం
- బలహీన వర్గాలను మోసం చేసే ఎత్తుగడే అంటున్న బీఆర్ఎస్.. చట్టబద్ధత కావాలని డిమాండ్



2

## ఎగువ గోదారి వెలవెల!

- జైక్వాడ్ నుంచి అన్నారం బరాజ్ వరకు కానరాని వరద
- మేడిగడ్డ నుంచి ధవళేశ్వరం వరకు కొనసాగుతున్న ఉధృతి
- ప్రాణహిత, ఇంద్రావతి వరదలు తోడుకావడమే కారణం



జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:

రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించి నెలన్నర గడిచిపోయినా వరద ప్రవాహం లేక ఎగువ గోదావరి వెలవెలబోతోంది. మరోవైపు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లోని దిగువ పరీవాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ఉప నదులైన ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, వాగులు, వంకల్లో వరద ఉధృతి పెరిగి దిగువ

మిగతా 4వ పేజీలో..

## రేషన్ కార్డు.. పేదవాడి ఆత్మగౌరవం

- తిరుమలగిరిలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి
- రేషన్ కార్డు పేదవాడి ఆత్మగౌరవం, గుర్తింపు, ఆకలి తీర్చే ఆయుధమన్న రేవంత్ రెడ్డి
- పదేళ్లు అధికారంలో ఉన్నా బీఆర్ఎస్ కు సన్నబియ్యం ఆలోచన రాలేదని విమర్శలు



2



## ఢిల్లీకి తెలుగు రాష్ట్రాల నీటి పంచాయితీ.. రేపు సీఎంల భేటీ..

- నీటి వాటాలపై తేల్చుకునేందుకు సిద్ధమైన తెలుగు రాష్ట్రాలు..
- ఇరు రాష్ట్రాల సీఎంల హస్తినబాట..
- రేపు మధ్యాహ్నం 2.30 గంటలకు ఢిల్లీలో భేటీ..
- ఏపీ, తెలంగాణ సీఎంల భేటీని ఫిక్స్ చేసిన జలశక్తి శాఖ..

6

## 14వ తారీఖు వచ్చినా వేతనాలేవి?..

### జీతాల కోసం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల ఎదురుచూపు





- ప్రతినెలా ఇదే తంతు.. ఆర్థిక ఇబ్బందులతో సతమతం..
- రేవంత్ సర్కారు తీరుపై యూనియన్ నేతల ఆగ్రహం

2

# రిజర్వేషన్ల చుట్టూ రాజకీయం

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
రాష్ట్ర రాజకీయాలన్నీ బీసీ రిజర్వేషన్ల అంశం చుట్టూనే తిరుగుతున్నాయి. స్థానిక సంస్థలకు మూడు నెలల్లో ఎన్నికలను నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఊపందుకున్న రిజర్వేషన్ల రగడను రాజకీయంగా ఉపయోగించుకునేందుకు అన్ని ప్రధాన పార్టీలు ఎత్తులు వేస్తున్నాయి. ఇందులో అధికార కాంగ్రెస్ ఓ అడుగు ముందుండగా.. బీఆర్ఎస్, బీజేపీ కూడా బీసీల మన్ననలు పొందేందుకు తమదైన శైలిలో ప్రయత్నిస్తున్నాయి.
అయితే, పార్టీల వ్యూహ, ప్రతివ్యూహాలు ఎలా ఉన్నా.. ఈసారి స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలుకాకుండా ఎక్కడ ఆగిపోతాయేమోననే ఆందోళన బీసీ సంఘాలు, ఆయా వర్గాల ప్రజల్లో వ్యక్తమవుతోంది. మొత్తం మీద బీసీ రిజర్వేషన్ల అంశంలో రాజకీయ కౌంటర్లు, ఎన్‌కౌంటర్లు, కోర్టు కేసు వ్యవహారంపై భిన్నాభిప్రాయాల నేపథ్యంలో అసలు ఎన్నికల ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలియకుండానే రాష్ట్రంలో 'స్థానిక'వేడి మొదలుకావడం గమనార్హం.

**అధికార పార్టీ ఏమనుకుంటోందంటే..**

ఎవరెంతో.. వారికంత అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అందిపుచ్చుకున్న దేశవ్యాప్త నినాదంతో సామాజిక న్యాయం చేస్తున్నామని చెప్పుకునేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఎస్సీల వర్గీకరణ, మంత్రివర్గ విస్తరణతోపాటు తాజాగా రాష్ట్ర కేబినెట్ ఆమోదించిన ఆర్డినెన్స్‌తో అన్ని వర్గాలకు తాము న్యాయం చేస్తున్నామని చెబుతోంది. అంతకంటే ముందు అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీ బిల్లు కూడా కామారెడ్డి డిక్లరేషన్‌ను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామనేందుకు నిదర్శనమని ఆ పార్టీ నేతలంటున్నారు.
తాము మాత్రమే బీసీలకు న్యాయం చేయగలమని, అందుకే చేశామని ఆ పార్టీ నేతలంటుండగా సీఎం రేవంత్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి రాహుల్‌గాంధీ ప్రధాని అయి ఉంటే 48 గంటల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయించేవాడినన్నారు. కేబినెట్ ఆర్డినెన్స్ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా సంబురాలు నిర్వహించి తామే బీసీల చాంపియన్‌నని చెబుతోంది. ఈ నేపథ్యంలోనే మరోమారు ఢిల్లీ యాత్రకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ పార్టీ వర్గాల్లో బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్ ఆగం చేస్తుందా అనే మీమాంస కూడా కనిపిస్తోంది. ఇప్పటికే అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీ బిల్లు రాష్ట్రపతి, పార్లమెంటు ఆమోదం కోసం పెండింగ్‌లో ఉండగా, ఇప్పుడు ఆర్డినెన్స్ తీసుకురావడం ఏ మేరకు మేలు చేస్తుందనే దానిపై ఆ పార్టీ నేతల్లోనూ సందేహాలు వ్యక్తమవుతుండటం గమనార్హం.

**విపక్షాలు ఏమనుకుంటున్నాయంటే...**

కర్ర విరగకుండా పాము చావకుండా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని, అధికారంలో ఉన్న పార్టీగా చేయాల్సింది చేయకుండా బీసీ వర్గాలను బుట్టలో వేసుకోవడమే లక్ష్యంగా ముందుకెళ్తోందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. బీసీలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో రాష్ట్రం నుంచి అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు తీసుకెళ్తానని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందినప్పుడే చెప్పారని, అయితే ఇప్పటివరకు ఆ ప్రయత్నం ఎందుకు చేయలేదని నిలదీస్తున్నాయి.
అన్ని పార్టీలను ప్రధాని వద్దకు తీసుకెళ్తానని చెప్పిన తర్వాత ఎన్నోసార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసి వచ్చిన ఆయన కనీసం ఒక్కసారి కూడా ఎందుకు బీసీ బిల్లు ఆమోదం గురించి వినతిపత్రం ఇవ్వలేదని ప్రశ్నిస్తున్నాయి. రాష్ట్రపతి వద్దకు వెళ్లిన బిల్లును ఆమోదింపజేసి పార్లమెంటు ఆమోదం కోసం తీసుకురావడంలో కాంగ్రెస్ చేసిన కృషి ఏంటో చెప్పాలని డిమాండ్ చేస్తున్నాయి.
బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలన్న ప్రధాన డిమాండ్‌ను వినిపిస్తున్న బీఆర్ఎస్ ఈ విషయంలో కాంగ్రెస్ వైఖరిని తప్పుపడుతోంది. బీసీలను మోసం చేసేందుకే ఆర్డినెన్స్ అంటున్నారని, ఏకసభ్య కమిషన్ పేరుతో ఇచ్చిన నివేదిక లొసుగులతో ఉందని, ఈ నేపథ్యంలో బీసీలకు న్యాయం జరిగే పరిస్థితి లేదని అంటోంది. ఇక, బీజేపీ కూడా ఈ విషయంలో కాంగ్రెస్ వైఖరిని తప్పుపడుతోంది. రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగా, ఆర్డినెన్స్ తేవడం బీసీలను ఏమార్చడానికేనని అంటోంది. తాము బహిరంగంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశానికి మద్దతిస్తున్నా.. అటు రాష్ట్రపతితోపాటు ఇటు పార్లమెంటులోనూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లుకు ఆమోదం పొందకపోతే తమకు 'స్థానిక'ంగా పట్టురాదేమోననే ఆందోళన కమలనాథుల్లో వ్యక్తమవుతోంది.

**బీసీ సంఘాలు ఏమంటున్నాయి...**
ఆర్డినెన్స్ ఆధారంగా ప్రభుత్వం జారీ చేయాలనుకుంటున్న రిజర్వేషన్ల జీవోకు న్యాయపరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయన్న దానిపై బీసీ సంఘాల్లో, ఆయా వర్గాల ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ జీవో కోర్టులో నిలబడుతుందా లేదా అన్న దానిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కోర్టులో సవాల్ చేస్తే నిలబడదని కొందరు, కొన్ని ప్రాతిపదికల మీద నిలబడుతుందని మరికొందరు అంటున్నారు. గతంలో సుప్రీంకోర్టు చెప్పిన విధంగా రిజర్వేషన్ల సీలింగ్ 50 శాతానికి పరిమితం అవుతుందని, ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన కల్పించే రిజర్వేషన్లు పోను 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు వర్తింపజేయడం సుప్రీం తీర్పు అమల్లో ఉన్నంతవరకు సాధ్యం కాదని, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే జీవోను సవాల్ చేస్తే వెంటనే కోర్టు కొట్టి వేస్తుందనేది వారి వాదన.
అయితే, గతంలో బీసీల జనాభా లెక్కలు అందుబాటులో లేనందున కోర్టులు కొట్టివేశాయని, ఇప్పుడు ప్రభుత్వం చేసిన కుల సర్వేలో బీసీల జనాభా 56 శాతంగా తేలిందని, బీసీలకు తగినంత రిజర్వేషన్లు కల్పించవచ్చని సుప్రీం కోర్టు తీర్పులోనే పేర్కొన్నందున 42 శాతం కోటా న్యాయ సమీక్షలో నిలబడుతుందని మరికొందరు వాదిస్తున్నారు. అలాగే, డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు అంశం కూడా ఈ వాదనకు బలాన్నిస్తుందని అంటున్నారు. మరోవైపు అగ్ర వర్ణాలకు ఈడబ్ల్యూఎస్ కోటా అమలు చేసే క్రమంలోనే 50 శాతం సీలింగ్ చాలా రాష్ట్రాల్లో దాటిపోయిందని, తెలంగాణలోనూ ఇబ్బంది ఉండదని వారంటున్నారు. మరోవైపు బీసీ వర్గాలకు న్యాయం జరుగుతున్నందున దాన్ని అడ్డుకోవద్దని, కోర్టుల్లో కేసులు వేయొద్దని అటు రాజకీయ పార్టీలకు, ఇటు ప్రజలకు బీసీ సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నా ఏ క్షణంలో కోర్టులో కేసు పడుతుందోననే గుబులు మాత్రం కనిపిస్తోంది. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో ఇచ్చిన మరుసటి రోజే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున కోర్టు కూడా జోక్యం చేసుకోదనే వాదన సముచితం కాదనే భిన్నమైన అంశాన్ని బీసీ సంఘాల నిపుణులు తెరపైకి తెచ్చారు. గతంలో మహారాష్ట్రలో ఇదే జరిగిందని, మరాఠాలను బీసీల్లో చేర్చి, వారికి రిజర్వేషన్లు కల్పించి పంచాయతీ ఎన్నికలకు వెళ్తే సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని మరీ ఎన్నికల ప్రక్రియను నిలిపివేసిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో జీవోలు, ఆర్డినెన్స్‌ల కంటే పార్లమెంటు ఆమోదం ద్వారా 42 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చడమే రక్షణ కవచమని, ఆ కోణంలోనే అన్ని పార్టీలు చిత్తశుద్ధితో పనిచేయాలని బీసీ సంఘాలు కోరుతున్నాయి.

# హైదరాబాద్ క్రికెట్‌లో రాజకీయుల హవా..

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
ప్రెసిడెంట్ తో సహా మరో నలుగురు జైలుపాలయ్యారు...!! తీగ లాగితే డొంక కదిలి... అందరి బాగోతం బయటపడుతోంది..!! వందల కోట్ల అవినీతి చూసి జనాలు ఛీ కొడుతున్నారు..!! అయినా HCA తీరు మారడం లేదు. నెక్స్ నేనే ప్రెసిడెంట్... నువ్వు సెక్రెటరీ... అని కొందరంటే... నీ బాగోతం కూడా బయటపెడతా... నేనే ప్రెసిడెంట్ అంటున్నాడట మరో పెద్దాయన !! అవినీతి మరకను కడిగిపారేసి.. ఇప్పటికైనా హెచ్‌సీఏలో ప్రక్షాళన చేపట్టాల్సిందిపోయి.. అవినీతి తిమింగలాల వారసులు పుట్టుకొస్తున్నారట !!
హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జగన్మోహన్ రావుతోపాటు... హెచ్‌సీఏ పెద్దలు అరెస్ట్ అయ్యారు. ప్రస్తుతం జైల్లో ఊసలు లెక్కపెడుతున్నారు. ఇప్పటివరకు HCA అవినీతి ఆరోపణలు... కేసులే తప్ప అరెస్ట్ ల దాకా వెళ్లింది లేదు. ఫర్ ది ఫస్ట్ టైం... బిగ్ వికెట్స్ పడ్డాయి. అవినీతి ఇన్నింగ్స్ తేటతెల్లమైంది. విజిలెన్స్, సీఐడీ బౌన్సర్లకు హెచ్‌సీఏ అక్రమార్కులంతా క్లీన్ బౌల్డ్ అయ్యారు. జగన్నాటక సూత్రదారి జగన్ తోపాటు... కోట్లు దొబ్బితిన్న తిమింగలాలన్నీ జైలుపాలయ్యాయి.
హెచ్‌సీఏ లో వచ్చిన భారీ కుదుపుకు హెచ్‌సీఏ తాజా మాజీలంతా దడుసుకున్నారు. నా బాగోతం బయటపడకుండా చూడు దేవుడా.. అని మొక్కుకోని వాళ్లుండరు !! హెచ్‌సీఏ కి ఇప్పటికైనా మంచి రోజులు వస్తాయని క్రికెట్ ఫ్యాన్స్ భావిస్తుంటే... సీన్ మరోలా ఉంది. అవినీతి మరకలను తుడిచిపారేసి... ఇకనైనా ప్రక్షాళన చేయాల్సిందిపోయి.. అప్పుడే పావులు కదపటం మొదలుపెట్టారు హెచ్‌సీఏ పెద్దలు. నేనే ప్రెసిడెంట్ అని ఒకరు... నేనే సెక్రెటరీ అని ఒకరు... అసలు నువ్వేలా ప్రెసిడెంట్ అవుతావో నేనూ చూస్తా అని మరొకరు!!! ఇలా పెద్ద యుద్ధమే జరుగుతోంది హెచ్‌సీఏలో.
ఏజీఎం.. అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ పెట్టుకోవాలి...! ప్రస్తుతం ఉన్న బాడీని రద్దు చేయాలి. ఎన్నికలకు వెళ్లాలి. ఇదంతా పెద్ద ప్రాసెస్. కానీ.. అప్పుడే ఎన్నికల హీట్ పుడుతోంది హెచ్‌సీఏలో. ఇప్పటికే హెచ్‌సీఏ మాజీ ప్రెసిడెంట్ అజారుద్దీన్ స్పందించాడు. అవడకాశం వస్తే.. ప్రెసిడెంట్‌గా పోటీ చేసి హెచ్‌సీఏ ప్రక్షాళన చేపడతా అంటున్నారు. ప్రెసిడెంట్ రేసులో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, అనిల్, రోహిన్ రెడ్డి అంటూ... కొందరి పేర్లు వినిపిస్తున్నాయి. వీళ్లంతా కాంగ్రెస్ నేతలే. అజారుద్దీన్ మినహా... మిగతావాళ్లేవరికీ బ్యాట్, బాల్‌తో పరిచయమే లేదు. ఐనా... రాజకీయ జోక్యం, రాజకీయ నేతల ప్రమేయం లేకుండా ఎన్నికలు జరిగితేనే కదా.. హెచ్‌సీఏ తీరు మారేది.
అర్షద్ ఆయుబ్... వివేక్... అజారుద్దీన్... తాజాగా జగన్మోహన్ రావు... ఇలా ప్రెసిడెంట్ కుర్చీలో ఎవరున్నా, ఆడేది మాత్రం అవినీతి ఇన్నింగ్స్ !! క్రికెట్ డెవలప్‌మెంట్ తప్ప అన్నీ ఉంటాయి. బాడీ ఏదైనా... బీసీసీఐ నుంచి వస్తున్న నిధులను అప్పనంగా తినడంలో ఆరితేరారు. కోట్లు ఖర్చు పెట్టి ఎన్నికల్లో పోటీ చేయడం.... గెలవడం... ఎన్నికల్లో ఖర్చు చేసిన డబ్బుకు పదింతలు తిని మమ అనిపించడం !!! అందరిదీ ఇదే తీరు. అంతా ఆయారామ్... గయారామ్ లే!!
అసలు క్రీడా సంఘాల్లో క్రీడాకారులుండాలి కానీ... రాజకీయ నాయకుల జోక్యాలు ఎందుకు..? బ్యాట్ పట్టింది లేదు... బాల్ వేసింది లేదు... అసలు క్రికెట్ ఓనమాలు తెలియకపోయినా... ఎన్నికల బరిలో ఉంటారు కొందరు. వీళ్లంతా సంఘాల్లోకి ఎలా ఎంట్రీ ఇస్తున్నారు. క్రికెట్ క్లబ్బులు ఎలా నడుపుతున్నారు..? వీళ్లకే ఆట రానప్పుడు... క్లబ్ పెట్టి క్రికెటర్లను ఎలా తయారు చేస్తారు..?
క్రికెట్ అసోసియేషన్స్ లో రాజకీయ పార్టీల జోక్యం ఎక్కువైంది. హెచ్‌సీఏ మొదలుకుని... జిల్లా క్రికెట్ క్లబ్‌ల వరకు పొలిటీషియన్లదే హవా. అసోసియేషన్లలో రాజకీయ ప్రమేయమే ఉండకూడదు అని ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ స్ట్రిక్ట్ రూల్. కోట్లకు కోట్లు నిధులు ఇస్తున్న బీసీసీఐ... మీ స్టేట్ నుంచి ప్లేయర్లు ఎందుకు తయారు కావడం లేదని ప్రశ్నించదు !! క్లబ్ సెక్రెటరీలూ అడగరు ! హెచ్‌సీఏ లో ఏం జరుగుతుందో కామన్ క్రికెట్ ఫ్యాన్స్‌కి అసలు అర్థమే కాదు..
2023 సరిగ్గా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు నెల రోజుల ముందు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. అప్పటికే అధ్యక్షుడిగా ఉన్న అజారుద్దీన్ పదవీ కాలం ముగియడం.... అజ్జూ భాయ్‌పై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో... సుప్రీం కోర్ట్ ఆదేశాలతో అప్పట్లో HCA ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లోనే యునైటెడ్ మెంబర్స్ ఆఫ్ HCA పేరుతో పోటీ చేశాడు జగన్మోహన్ రావు. ప్రత్యర్థి అమర్నాథ్ పై చావు తప్పి కన్ను లొట్టపోయినట్టు.. ఒకే ఒక్క ఓటుతో గెలిచారు. అప్పటివరకు జగన్మోహన్‌రావుకి HCA తో ఎలాంటి సంబంధాలు లేవు... క్రికెట్ క్లబ్ లేదు... క్రికెట్ క్లబ్‌లతో పరిచయమే లేదు.. !! అసలు జగన్మోహన్ రావు అంటేనే ఎవరికీ గిట్టలేదు. ఐనా ప్రెసిడెంట్‌గా గెలిచేశాడు.
ఎన్నికలకు ఒక నెల ముందు మాత్రమే సభ్యత్వం తీసుకొని ఏడాది నుంచి తాను మెంబర్ నేనని.. నమ్మించి హెచ్సీఏ అధ్యక్షునిగా గెలిచాడు జగన్మోహన్ రావు. అప్పటిదాకా తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా.... ప్రీమియర్ హ్యాండ్ బాల్ లీగ్ ఛైర్మన్ గా... హ్యాండ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన జగన్మోహన్ రావు... ఉన్నట్టుండి HCA ప్రెసిడెంట్ అయిపోయారు. కారణం జగన్మోహన్ రావు వెంట ఉన్న పొలిటికల్ పవర్.
హెచ్‌సీఏ లో అవినీతి అంటే.... కేవలం సొమ్ము నొక్కేయడమే కాదు ఇంకా చాలానే ఉన్నాయి. దశాబ్ధాల కాలంగా అందులో పాతుకు పోయిన కొందరు మెంబర్స్ కూడా హెచ్‌సీఏ పరువు బజారు కీడుస్తున్నారు. పి. యాదగిరి ఈయన... ఏ మెంబర్ స్థాయి నుంచి వైస్ ప్రెసిడెంట్ వరకు అన్ని పదవులు చేపట్టారు. 26 ఏళ్ల పాటు హెచ్సీఏ లోనే ఉన్నారు. పిఆర్ మాన్సింగ్... జాయింట్ సెక్రెటరీగా... సెక్రటరీగా ఉంటూ పాతికేళ్లుగా పాతుకుపోయారు. ఎన్ శివలాల్ యాదవ్.. ఈసీ మెంబర్ నుండి వైస్ ప్రెసిడెంట్ వరకు ఎదిగారు. 24 ఏళ్లుగా హెచ్సీఏ లోనే ఈయన మకాం !! జాన్ మనోజ్ ... ఈసీ మెంబర్ గా మూడు సార్లు... సెక్రెటరీగా ఒకసారి చేశారు. ఈయన 22 ఏళ్లుగా హెచ్సీఏ లోనే ఉంటున్నారు. సురేందర్ కుమార్ అగ్రవాల్ ఈసి మెంబర్ నుండి ట్రెజరర్... వైస్ ప్రెసిడెంట్ గా చేశారు. హెచ్సీఏ లో ఈయన సీనియారిటీ 19 ఏళ్ళు !! విజయానంద్... ఈసీ మెంబర్ స్థాయి నుండి సెక్రెటరీ పొజిషన్ వరకు 19 ఏళ్లుగా తిష్ట వేశారు.
గోపాల్ 18 ఏళ్లుగా ఈసీ మెంబర్ గానే కొనసాగుతున్నారు. జి వినోద్ వైస్ ప్రెసిడెంట్ గా రెండు సార్లు ప్రెసిడెంట్ గా మరో రెండు సార్లు చేసి 18 ఏళ్లుగా పాతుకుపోయారు. అర్షద్ ఆయూబ్.. ఈసీ మెంబర్ గా మొదలై రెండు సార్లు ప్రెసిడెంట్ గా చేసి 16 ఏళ్లుగా హెచ్సీఏ లోనే ఉన్నారు. నరేందర్ గౌడ్ ఈసీ.. మెంబర్ గా వైస్ ప్రెసిడెంట్ గా చేసి 16 ఏళ్లుగా కొనసాగుతున్నారు. పురుషోత్తం అగర్వాల్ జాయింట్ సెక్రెటరీగా మూడు సార్లు చేశారు. 16 ఏళ్లుగా హెచ్సీఏ లోనే ఉంటున్నారు. నరేష్ శర్మ ఈసీ మెంబర్ గా ట్రెజరర్ గా జాయింట్ సెక్రెటరీగా చేసి 15 ఏళ్లుగా అక్కడే ఉంటున్నారు. ఎస్ వెంకటేశ్వరన్ 15 ఏళ్లుగా హెచ్సీఏ లోనే తిష్ట వేశారు.
1934 లో ఏర్పడిన హెచ్‌సీఏ కి తొలుత 10 క్లబ్బులున్నాయి. 1960 కి వచ్చేసరికి 30 క్లబ్బులుగా.. మారింది. రాష్ట్రవ్యాప్తంగా క్రికెట్ కి ఉన్న క్రేజ్ తో క్లబ్ ల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఈ క్లబ్బులే... హెచ్‌సీఏ భవిష్యత్తును డిసైడ్ చేస్తాయి. క్లబ్బులే హెచ్‌సీఏ పీఠంలో ఎవరుండాలి అని డిసైడ్ చేస్తాయి. ఒకప్పుడు హెచ్‌సీఏ చెప్పిందే వేదంలా పాటించే క్లబ్బులు... ఇప్పుడు హెచ్‌సీఏను ఆదేశించే స్థితికి చేరుకున్నాయి క్లబ్బులు. క్లబ్బులు డిసైడ్ ఐతే... వార్ వన్ సైడే !!
క్రీడాకారులను గుర్తించి... శిక్షణ ఇచ్చి... వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయాల్సిన బాధ్యత క్లబ్బుల మీద ఉంది. కానీ... ఏ ఒక్క క్లబ్ ఈ పని చేయదు. తమ పిల్లలు... బంధువుల పిల్లలు... స్నేహితుల పిల్లలు... లేదా డబ్బులిచ్చిన వాళ్ల పిల్లలు... బడా పారిశ్రామిక వేత్తలు, పొలిటికల్ లీడర్ల పిల్లలకు మాత్రమే చోటు కల్పిస్తారు. కొందరు పొలిటీషియన్లు... రాజకీయనేతలకు కూడా క్లబ్బులున్నాయి. కారణం.. క్లబ్బులున్నవాడు వీళ్లకు లీజుకు ఇస్తున్నారు. ఇయర్లీ 15 లక్షలకి 20 లక్షలకి లీజుకి ఇస్తున్నారు.
అంత డబ్బులు పెట్టి లీజుకు తీసుకున్నవాడు ఊరికే ఉంటాడా..? డబ్బును ఎలాగైనా సంపాధించుకోవాలనే చూస్తాడు..? అప్పుడే అసలు కథ మొదలుపెడతాడు. మీకు బౌలింగ్ చేయడం వచ్చా...! బ్యాటింగ్‌లో అనుభవం ఉందా..! పర్ఫెక్ట్‌గా రానక్కర్లేదు.. అంతంతమాత్రంగానే వచ్చా..! అయితే మీరు చిటికెలో రంజీ ప్లేయర్ ఐపోవచ్చు. నచ్చిన ట్రోఫీలో ఆడే ఛాన్స్ మీసొంతం. డబ్బులు వెదజల్లితే చాలు. డివిజన్‌లీగ్‌కి ఒకరేటు.. బీసీసీఐ టోర్నీలకు ఒకరేటు.. రంజీలకు మరొకరేటు చొప్పున రేటు కడతాడు. పైసా పేకో.. క్రికెట్ ఖేలో అని బోర్డు పెట్టేస్తాడు.
క్రికెటర్ కావాలని... టీం ఇండియాకి ఎంపికవ్వాలని కలలుకంటూ.. ఆ దిశగా అహర్నిశలు కష్టపడుతున్న యువకులు ఎందరో ఉన్నారు. రంజీ ప్లేయర్ అయినా అవ్వాలని... బీసీసీఐ లీగ్స్, కనీసం డివిజన్ లీగ్స్ కైనా ఆడాలని శ్రమిస్తున్నారు. కానీ... వీళ్ల క్రికెట్ జీవితానికి చరమగీతం పాడుతుంటాయి క్రికెట్ క్లబ్స్. వాళ్ల ఆశలను అడియాశలు చేస్తూ... కష్టపడి శ్రమించిన వాళ్లను కాదని... కాసులు వెదజల్లేవాళ్లనే క్రికెటర్లుగా మారుస్తున్నాయి. లీగ్‌కో రేటు పెడుతూ.... లక్షల రూపాయలు దండుకుంటున్నాయి. క్రికెట్ ఓనమాలు తెలియని వారిని సైతం... రంజీ ప్లేయర్ స్థానానికి తీసుకెళ్తున్నాయి క్రికెట్ క్లబ్స్. ఏమాత్రం సత్తా లేని ప్లేయర్ల ఎంపిక వెనుక అదృశ్యశక్తులున్నాయి. ప్రతిభను కొలమానంగా తీసుకొని టీమ్‌లో స్థానం కల్పించే రోజులు పోయాయి. ఎవరి చేతిలో ఎక్కువ క్లబ్‌లు, ఎవరు ఎక్కువ డబ్బులు ముట్టచెబితే వాళ్ల పిల్లలే హైదరాబాద్ తరపున ఆడడం ఆనవాయితీగా మారిపోయింది. హెచ్‌సీఏ కూడా పేరుకు తగ్గట్టే... హైదరాబాద్ కే పరిమితమైంది. జిల్లాల వైపు కన్నెత్తి చూడటం లేదు. ఆ ఊసే ఉండదు.

# ఎడ్యుటెక్ కంపెనీల కట్టడి ఎలా?




**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

చట్ట విరుద్ధంగా కోచింగ్ కేంద్రాలను నిర్వహిస్తున్న సంస్థలను నియంత్రించటంపై ప్రభుత్వం దృష్టి సారించింది. వీటిని దారికి తెచ్చేందుకు విద్యా శాఖ, రెవెన్యూ, పోలీసు విభాగాల అధికారులతో ప్రత్యేక కమిటీ వేయాలని భావిస్తోంది. ఇంజనీరింగ్‌లో నైపుణ్యం పేరుతో కొన్ని సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఉన్నత విద్యా మండలి గుర్తించింది. డీమ్డ్, ప్రైవేటు యూనివర్సిటీల్లోకి స్కిల్ పేరుతో చొరబడుతున్న ఈ కంపెనీల వల్ల జరిగే నష్టాలను మండలి అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. స్కిల్ కోసం షార్ట్‌కట్స్‌లో ఇవి బోధిస్తున్నాయి. సబ్జెక్టు ఫ్యాకల్టీలో నాణ్యత పాటించడం లేదు. ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఈ కోచింగ్ కేంద్రాలకు వెళ్లడం వల్ల నష్టం జరుగుతుందని ప్రభుత్వానికి మండలి తెలిపింది.

**ఏం చేస్తారో చేసుకోండి**

ఎలాంటి అనుమతులు లేకుండా కోచింగ్ కేంద్రాలు నడుపుతున్న సంస్థలకు గత నెలలో ఉన్నత విద్యా మండలి నోటీసులు ఇచ్చింది. అయితే, నోటీసులు పొందిన సంస్థలు మండలికి ఘాటుగా సమాధానం ఇచ్చాయి. తామెక్కడా చట్ట వి రుద్ధంగా బోధన చేయడం లేదని, విద్యార్థులు స్కిల్ కోసం తమ దగ్గరకు వస్తున్నారని పేర్కొన్నాయి. అసలు తమను నియంత్రించడం, నోటీసులు ఇచ్చే అధికారం ఉన్నత విద్యా మండలికి లేదని న్యాయవాదులతో సమాధానం ఇవ్వడంతో మండలి వర్గాలు నివ్వెరబోయాయి.
ఇదే విషయాన్ని అధికారులు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. మరోవైపు ఆ సంస్థల్లో చేరిన విద్యార్థులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడించడం, మండలి అధికారులను తప్పుబడుతూ విద్యార్థులు మెయిల్స్ ఇవ్వడంతో సమస్య తీవ్రంగా మారింది. ఈ నేపథ్యంలో ఏం చేయాలో చెప్పాలని మండలి అధికారులు ప్రభుత్వాన్ని కోరారు. దీంతో సీఎం కార్యాలయం విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఇటీవల దీనిపై చర్చించింది.

**కట్టడి చేయకుంటే కష్టమే**

ఇంజనీరింగ్ పూర్తవ్వగానే ఉద్యోగం పొందడం ఒక్కటే లక్ష్యంగా భావిస్తున్న విద్యార్థుల బలహీనతను కోచింగ్ కేంద్రాలు అనుకూలంగా మార్చుకుంటున్నాయి. ఇందులో డీమ్డ్, ప్రైవేటు యూనివర్సిటీలు ప్రధానంగా భాగస్వామ్యం అయ్యాయి. సబ్జెక్టులకు ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వకుండా, కేవలం ఉద్యోగం పొందేందుకు కొత్తగా వస్తున్న చాట్ జీపీటీ, ఏఐ సంబంధిత టెక్నాలజీపైనే షార్ట్ కట్స్ బోధిస్తున్నాయి. ఈ క్రమంలో కీలకమైన ఫ్యాకల్టీని కూడా తగ్గిస్తున్నాయి. హైదరాబాద్‌లోని రెండు డీమ్డ్ వర్సిటీలు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న డీమ్డ్ వర్సిటీల ఆఫ్ క్యాంపస్‌లపై గత ఏడాది కూడా పెద్ద ఎత్తున ఫిర్యాదులొచ్చాయి. ఎమర్జింగ్ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు కాలేజీల్లో కాకుండా, స్కిల్ కేంద్రాల్లో బోధిస్తున్నారు. పరీక్షలు నిర్వహించి, డిగ్రీలు ఇవ్వడం మాత్రం కాలేజీల్లోనే జరుగుతోంది. ఇది పూర్తిగా చట్ట విరుద్ధమని మండలి పేర్కొంది. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో బేసిక్స్ నేర్పుతారు. రెండు, మూడు సంవత్సరాల్లో కీలకమైన కోడింగ్‌పై సబ్జెక్టులు ఉంటాయి. ఇదే క్రమంలో ఎమర్జింగ్ కోర్సులకు పారిశ్రామిక భాగస్వామ్యంతో శిక్షణ ఇవ్వాలి. అప్పుడే విద్యార్థి కోడింగ్‌పై పట్టు సాధిస్తాడు. ఏఐ చేసే కోడింగ్, డీ–కోడింగ్ కచ్చితమైనదేనా? కాదా? అనేది సబ్జెక్టులపై అవగాహన ఉన్నప్పుడే తెలుస్తుంది. ప్రైవేటు కాలేజీలు దీన్ని విస్మరించి ఉద్యోగం పొందడానికి అవసరమైన స్కిల్స్‌ను మాత్రమే నేర్పుతుండటంతో ఉద్యోగం వచ్చినా, పనిలో పురోగతి సాధించలేకపోతున్నారు. గడచిన ఐదేళ్లలో ఐటీ కంపెనీల్లో అనేక మంది కోడింగ్‌పై పట్టు లేకపోవడం వల్లే ఉద్యోగాలు పోగొట్టుకున్నారు.

## కార్యాలయంపై దాడి.. కవితపై మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేసిన తీన్మార్ మల్లన్న

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
ఆదివారం తనపై హత్యాయత్నం జరిగిందని, ఈ విషయంపై శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఫిర్యాదు చేశానని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తెలిపారు. కవిత అనుచరుల విధ్వంసాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. ఆదివారం క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి జరిగింది. ఈరోజు మండలి చైర్మన్‌ను కలిసిన మల్లన్న దాడి ఘటనపై ఫిర్యాదు చేశారు.
అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అనుచరులు క్యూ న్యూస్ కార్యాలయానికి వచ్చి చేసిన విధ్వంసాన్ని చైర్మన్‌కు వివరించానని తెలిపారు. డీజీపీని కూడా కలిసి ఫిర్యాదు చేస్తానని ఆయన వెల్లడించారు. కార్యాలయంపై దాడి నేపథ్యంలో తనకు రక్షణ కల్పించాలని చైర్మన్‌ను కోరానని తీన్మార్ మల్లన్న తెలిపారు. కవితపై ఎథిక్స్ కమిటీకి ఫిర్యాదు చేసి, చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. దాడి ఘటనపై విచారణ జరుపుతామని మండలి చైర్మన్ హామీ ఇచ్చారని వెల్లడించారు. కవిత బీసీ నినాదం వినిపించడంపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. బీసీల కట్టుబాట్లు, పదజాలం ఏమిటో కవితకు తెలియదని వ్యాఖ్యానించారు. బీసీల రాజకీయాన్ని నిలువరించాలనే ఉద్దేశంతోనే ఆమె ఈ నినాదం ఎత్తుకున్నారని ఆరోపించారు. మరోవైపు, క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి కేసు నేపథ్యంలో పోలీసు శాఖ తీన్మార్ మల్లన్నకు చెందిన ఇద్దరు గన్‌మన్లను సరెండర్ చేసింది.

# రేషన్ కార్డు.. పేదవాడి ఆత్మగౌరవం

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
ఉమ్మడి నల్లగొండ జిల్లాతో కాంగ్రెస్ పార్టీకి విడదీయరాని బంధం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రేషన్ కార్డు పేదవాడి ఆత్మగౌరవం గుర్తింపు అన్నారు. ఆకలి తీర్చే ఆయుధమని తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నల్గొండ చరిత్రే.. తెలంగాణ చరిత్ర అని కొనియాడారు. జిల్లా అభివృద్ధి అంతా కాంగ్రెస్ హయాంలోనే జరిగిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పార్టీకి 10 ఏళ్లు అవకాశం ఇస్తే గోదావరి నీళ్లు తుంగతుర్తికి ఎందుకు తేలేదు..? అని ప్రశ్నించారు.
పదేళ్లు అధికారంలో ఉన్నా పేదలకు రేషన్ కార్డు, సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన బీఆర్ఎస్ నేతలకు రాలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 3.10 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేశామని.. రేషన్ దుకాణాల వద్ద జనాలు బారులు తీరుతున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ ఇచ్చామని.. వ్యవసాయం దండగ కాదు.. పండగలా చేశామన్నారు. దేశం తలెత్తుకునేలా వరి ధాన్యం ఉత్పత్తి చేస్తున్నామని చెప్పారు. రైతు రాజు అయినప్పుడే ఇందిరమ్మ ఆత్మశాంతిస్తుందని ఆసక్తిక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం గోదావరి నీళ్లు ఇవ్వలేదని విమర్శించారు.. ఇప్పుడు సీఎం వస్తే అడ్డుకుంటామంటున్నారని తెలిపారు. గతంలో 3 రోజులు అవకాశమిస్తే తుంగతుర్తికి జలాలు తెస్తామన్నారని... పదేళ్లు అవకాశం ఇచ్చినా దేవాదుల నుంచి నీళ్లు తేలేదని విమర్శించారు. "గత ప్రభుత్వం సహాయక సంఘాలను పట్టించుకోలేదు. మేము అధికారంలోకి వచ్చిన తరువాత స్వయం సహాయక సంఘాలకు పెట్రోల్ బంకులు అప్పగించాం. ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ పవర్‌ను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారు. మూడు అగుడుల వ్యక్తి నన్ను అడ్డుకుంటానని అంటున్నాడు. గ్లాసులో సోడా పోసినంత ఈజీ కాదు.. గోదావరి నీళ్లు తేవడం. ఒక్కసారి అడ్డుకుని చూడు, మా దామన్న చూసుకుంటాడు. 10 ఏళ్లు అధికారం ఇస్తే గోదావరి నీళ్లు ఎందుకు తీసుకురాలేదు. రైతు భరోసా ఇవ్వలేదని రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి దొంగ ఏడుపులు ఏడ్చారు. కానీ తొమ్మిది రోజుల్లో అందరికీ రైతు భరోసా ఇచ్చాం." అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

# 14వ తారీఖు వచ్చినా వేతనాలేవి?..

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
ప్రతినెలా మొదటి తారీఖునే ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఖాతాల్లో వేతనాలు జమ చేస్తున్నామని ముఖ్యమంత్రి నుంచి మంత్రుల దాకా పదే పదే ఘంటాపథంగా చెబుతున్నరు. కానీ, క్షేత్రస్థాయిలో వాస్తవాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. ఫస్ట్ తారీఖు పోయి 14వ తారీఖు వచ్చినా వేతనాలు ఖాతాల్లో జమకాకపోవడంతో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతినెలా వేతనాలు ఆలస్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**70 వేల మంది ఎదురుచూపులు..**
రాష్ట్రవ్యాప్తంగా సుమారు 70 వేల మంది అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు పనిచేస్తున్నారు. టీచర్లకు రూ.13,650, హెల్పర్లకు రూ.7,800 చొప్పున వేతనాలు అందజేస్తున్నారు. అధికారంలోకి రాగానే అంగన్‌వాడీ సిబ్బంది వేతనాలను రూ.18 వేలకు పెంచుతామని, ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. కానీ, గద్దెనెక్కి 19 నెలలు దాటినా హామీ అమలు కావడం లేదని అంగన్‌వాడీ యూనియన్ల నాయకులు ఆరోపిస్తున్నారు. మొదటి తారీఖునే వేతనాలు ఇస్తున్నామని సీఎం, మంత్రులు చెబుతున్న మాటలు అబద్ధాలని మండిపడుతున్నారు.

**వేతనాల కోసం అరిగోస..**
వేతనాల ఆలస్యంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని అంగన్‌వాడీ సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇల్లు కిరాయి, నిత్యావసరాల కొనుగోలుకు అప్పులు చేయాల్సి వస్తుందని, పిల్లల ఫీజులు చెల్లించేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తమ బతుకులు బాగుపడతాయని అనుకున్న కలలు కల్లలవుతున్నాయని మనోవేదనకు గురవుతున్నారు.

**వెట్టిచాకిరీ చేసినా గుర్తింపు లేదు..**
రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు వేతనాలు అందించడంలో కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం వహిస్తున్నదని యూనియన్ నాయకులు ఆరోపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో తమకు వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించిన సర్వే బాధ్యతలతోపాటు ఎన్నికల విధులు కేటాయిస్తున్నారని చెబుతున్నారు. ప్రతిరోజూ వెట్టిచాకిరీ చేసినా ప్రభుత్వం తమను గుర్తించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులకు విజ్ఞప్తులు చేస్తేగానీ వేతన నగదు ఖాతాల్లో జమయ్యే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నెలనెలా జీతాలు చెల్లించాలని కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

**ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తున్నది**

ప్రతినెలా ఫస్ట్ తారీఖు వచ్చిందంటే రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు వేతనాలందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక సమస్యలతో సతమతమవు తూ అప్పుల పాలవుతున్నారు. ఈ సమస్య ను అనేకసార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదు. విధులు పక్కనబెట్టి ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. ఇప్పటికైనా సంబంధిత మంత్రి చొరవ చూపి వేతన సమస్యను పరిష్కరించాలి.
కే సునీత, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు(సీఐటీయూ)

# ఖబర్దార్ కవిత

- **కల్వకుంట్ల కవిత ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని వెంబడే రద్దు చేయాలి**
- **వికారాబాద్ జిల్లా తీన్మార్ మల్లన్న టీం**

**జర్నలిస్ట్ డైరీ వికారాబాద్ జూలై 14:–**

తెలంగాణలోని సబ్బండ ఎస్సీ,ఎస్టీ, బీసీ, వర్గాల కోసం పోరాడుతున్న తీన్మార్ మల్లన్నపై, మల్లన్న కార్యాలయంపై ఆదివారం ఉదయం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అనుచరులతో తీన్మార్ మల్లన్న పై దాడి చేయడంతో ఈ విషయంపై, సబ్బండ వర్గాలు,కవితని తప్పు పడుతున్న సందర్భంలో, వికారాబాద్ జిల్లా తీన్మార్ మండలం టీం అధ్యక్షులు ఘనపురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎన్టీఆర్ చౌరస్తాలో కల్వకుంట్ల కవిత దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా కల్వకుంట్ల కవితకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తీన్మార్ మల్లన్న టీం వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఘనపురం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనారిటీల సబ్బండ వర్గాల కోసం పోరాడుతున్న తీన్మార్ మల్లన్న పై, మల్లన్న కార్యాలయం న్యూస్ పై కల్వకుంట్ల కవిత తెలంగాణ జాగృతి అనుచరులతో గతంలో నయీం ముఠాలో పనిచేసిన కొందరు వ్యక్తులచే మల్లన్నను హతమార్చేందుకు ప్రయత్నం చేసిన సందర్భంలో, చాకచక్యంగా మల్లన్నకు ప్రాణాపాయం నుండి రక్షించేందుకు మల్లన్న గన్మెన్లు వ్యవహరించిన తీరుని ప్రశంసించారు. తీన్మార్ మల్లన్న మాట్లాడిన మాటలలో తప్పేమీ లేదని కంచం పొత్తు, మంచం పొత్తు అనే పదాలకు, మీ నాన్నను అడిగి అర్థాలు తెలుసుకోవాలని హితువు పలికారు. కనీస అవగాహన లేక అవగాహన రాహిత్యంతో దాడులకు పాల్పడితే ఊరుకునేది లేదని, కంచం పొత్తు అంటే, సాపంతి భోజనం అని, మంచం పొత్తు అంటే, ఇరు కుటుంబాలలో పెళ్లి సంబంధాలు అని అనే విషయం తెలుసువాలన్నారు. మీ పార్టీలో నీకు మనుగడ లేక, నిన్ను ఎవరు పట్టించుకోవడం లేదని నీ మనుగడ కోసం ఇలాంటి అసాంఘిక చర్యలకు పాల్పడితే, ఊరుకునేది లేదని అన్నారు. తెలంగాణలో ప్రతిదానికి, మండలికం ఇతిహాసాలు ఉంటాయని, వాటిని చాలా సందర్భాల్లో తెలంగాణ పౌరులు ఉపయోగిస్తుంటారన్నారు. ఏదేమైనా మరో మారు తీన్మార్ మల్లన్న పై, అవాకులు ఉత్స వాకులు మాట్లాడితే దాడి చేయించాలని ప్రయత్నం చేస్తే ఖబర్దార్ అని అన్నారు. ఇలాంటి దాడులకు పాల్పడితే నీ అంతు చూస్తామని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న కల్వకుంట్ల కవిత ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని వెంబడే రద్దు చేయాలని, వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఘనపురం శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్ జగదీష్ చారి, వికారాబాద్ మండల అధ్యక్షులు ఎం.సంతోష్, తీన్మార్ మల్లన్న టీం పరిగి నియోజకవర్గ అధ్యక్షులు వేమన్న, నవబు పేట్ అధ్యక్షులు కె.హరీష్, ఫయాజ్, కార్తీక్, మంజునాథ్, టీం మల్లన్న సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## ఆశ ఆసుపత్రిని ప్రారంభించిన పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 14 (జర్నలిస్ట్ డైరీ) :**

పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా నివసించే ఎల్లమ్మబండ ప్రాంతంలో అన్ని రకాల వసతులతో ఏర్పాటు చేసిన ఆసుపత్రిని ప్రజలు సద్వినియోగించుకోవాలని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆశ ఆసుపత్రిని కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ... అన్ని హంగులతో, సకల సౌకర్యాలతో ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయం అని, సరసమైన ధరలతో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, జిల్లా గణేష్, శివరాజ్ గౌడ్, బోయాకిషన్, పోశెట్టిగౌడ్, మహేష్, గోపాల్, లింగం, ఆదర్శ్, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.






## వర్షాలు కురువాలని.. కప్ప తల్లి పూజలు

**వీణవంక, జూలై 14(జర్నలిస్ట్ డైరీ)**

వీణవంక మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ యువకుల ఆధ్వర్యంలో సోమవారం వర్షాలు కురువాలని కప్పతల్లి ఆట నిర్వహించారు. అనంతరం డప్పు చప్పుళ్ళతో వాడవాడ తిరుగుతూ కప్ప తల్లి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షా కాలం ప్రారంభమై నెల రోజులు అయినప్పటికీ వర్షాలు లేవని అన్నారు.ఇప్పటికైనా సకాలంలో సమృద్ధిగా కురిసి ప్రజలందరూ సుఖ సంతోషాలతో పాడి పంటలతో ఉండాలని కోరారు.

## నాయి బ్రాహ్మణ సేవా సంఘం నూతన సభ్యులను అభినందించిన పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 14 (జర్నలిస్ట్ డైరీ) :**

శేరిలింగంపల్లి మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘంకు నిత్యం అందుబాటులో ఉంటానని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను శాలువాతో సత్కరించి ప్రత్యేకంగా చైర్మన్ అరెకపూడి గాంధీ అభినందించారు.

ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం ప్రెసిడెంట్లు సాయిలు నాయి, సురేష్ నాయి, ఉపాధ్యక్షులు పరుశురాం నాయి, జనరల్ సెక్రెటరీ రవీందర్ నాయి, ట్రెజరర్ శేఖర్, కార్యవర్గ సభ్యులు కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.





## సీఎం సహాయనిధి చెక్కును అందించిన పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 14 (జర్నలిస్ట్ డైరీ) :**

సీఎం రిలీఫ్ ఫండ్ లు పేదలకు వరమని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీకి చెందిన పూర్ణచందర్ వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా ఈ మేరకు రూ.14 వేలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా రూ.14 వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన ముఖ్యమంత్రి సహాయ నిది చెక్కును బాధిత కుటుంబానికి పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు. అదే విధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్తోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసానిస్తుందని ఈ సందర్భంగా తెలియచేశారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఆసుపత్రిలో బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆర్థిక సాయంని అందిస్తుందని దీనిలో భాగంగానే నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు ఎన్నో వందలాది కుటుంబాలను సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకున్నామని తెలిపారు. గతంలో ఉన్న బిల్లులకు అనుగుణంగానే ప్రస్తుతం ఆర్థిక సాయం అందిస్తుందని దానిని మరింత పెంచేలా కృషి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి త్వరలోనే కలిసి వినతి పత్రాన్ని అందజేస్తానని, మరింత ఆర్థిక సహాయం పెంచితే పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన గాంధీకి ప్రత్యేక కృతజ్ఞతలను బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయి నేనీ చంద్రకాంత్ రావు, జిల్లా గణేష్, పురెందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చదువుకున్న పాఠశాలకు ఫ్యాన్స్ అందజేత

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 14 (జర్నలిస్ట్ డైరీ) :**

రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండల్ జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్ లో 2004 2005 పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల జ్ఞాపకార్థంగా పది ఫ్యాన్లను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు మాట్లాడుతూ.. తాము చదువుకున్న క్రమంలో పాఠశాలకు సంబంధించిన వసతులు సరిగా లేవని చాలా బాధపడే వాళ్ళమని తాము చదువుకునే కాలంలో వసతులు సరిగ్గా లేకపోవడం వల్లే మేము తక్కువ చదువుతో చాలా బాధపడుతున్నామన్నారు. ఇప్పుడున్న విద్యా వ్యవస్థలో ప్రభుత్వం అన్ని రంగాలుగా విద్యార్థులకు సరైన సదుపాయాలు అందజేస్తున్నారు. ఇలాంటి సమయంలోనే విద్యార్థులు విద్యా పై దృష్టి పెట్టి చెడు వ్యసనాలకు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులకు, గురువులకు గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలన్నారు. ఉన్నతమైన చదువులు చదవాలని, విద్యావంతుడైతేనే విలువ ఉంటుందని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు.





## అత్తింటి వేధింపులు భరించలేక డెంటిస్ట్ ఆత్మహత్య

**జర్నలిస్ట్ డైరీ, తెలంగాణ:**

అత్తింటి వేధింపులు భరించలేక ఓ దంత వైద్యురాలు (డెంటిస్ట్) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా కమలాపూర్ మండలం మంగపేటకు చెందిన వైద్యుడు సృజన్‌తో వరంగల్‌కు చెందిన డెంటిస్ట్ ప్రత్యూషకు 2017లో వివాహమైంది. పెళ్లి సమయంలో వరుడికి రూ.30లక్షల కట్నం, 30 తులాల బంగారం, ఖరీదైన కారు ఇచ్చారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. కొంతకాలం హైదరాబాద్‌లో ఉన్న ఈ కుటుంబం.. గతేడాది హసన్‌పర్తిలోని కాకతీయ వింటేజ్ విల్లాస్‌లో స్థిరపడింది.

కొన్నాళ్ల క్రితం సృజన్‌కు హనుమకొండకు చెందిన ఓ యువతితో వివాహేతర సంబంధం ఏర్పడింది. దీంతో తన కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయడమేకాకుండా భార్య ప్రత్యూషను మానసికంగా, శారీరకంగా వేధించడం మొదలుపెట్టాడు. అత్తమామలు కూడా వారి కుమారుడికే మద్దతుగా నిలుస్తూ కోడల్ని వేధించారు. దీంతో మనస్తాపానికి గురైన ప్రత్యూష ఆదివారం భర్త ఇంట్లో ఉండగానే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన భర్త, స్థానికులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. అయితే, ప్రత్యూష ఒంటిపై గాయాలు ఉండటంతో ఆమె తల్లిదండ్రులు హసన్‌పర్తి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రత్యూషది ఆత్మహత్య కాదని.. భర్త, అత్తమామలు చిత్రహింసలకు గురిచేసి చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సృజన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.




## ఐదు నెలలుగా నుంచి జీతాలు రాక ఇబ్బంది

- **ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే స్కావెంజర్స్**

**జర్నలిస్ట్ డైరీ వికారాబాద్ జులై 14:–**

వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్స్ కు ఇంతవరకు జీతభత్యాలు లేక ఎంతగానో ఇబ్బందులు పడుతున్నారు. వికారాబాద్ జిల్లా పరిగి మండల పరిధిలోని అటెండర్లు లేని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వ ఆదేశాలతో పాఠశాలలు శుభ్రపరచడం కోసం ప్రభుత్వం స్కావెంజర్ లను నియమించడం జరిగింది. ఆ పాఠశాలల విద్యార్థులను బట్టి ఒక్కో పాఠశాలకు ఒక్కో విధంగా జీతభత్యాలు ఇవ్వాల్సి ఉంటుంది. గత అకాడమిక్ సంవత్సరానికి సంబంధించి స్కావెంజర్స్ కు జీతభత్యాలు పెండింగ్లో ఉన్నప్పటికీ, ఈ అకాడమిక్ సంవత్సరం మొదలైనా, స్కావెంజర్స్ ను అలాగే కొనసాగిస్తున్నారు. జీత బ్యాత్యలు రాని కొందరు స్కావెంజర్స్ వారి ఆవేదన వ్యక్తం చేస్తూ, ప్రతిరోజు తరగతి గదులను, పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేస్తూ మరుగుదొడ్లని శుభ్రపరుస్తూ, పాఠశాలలోనే ఉంటూ, పని చేసుకుంటున్నామని, అయినప్పటికీ, గత ఐదు ఆరు నెలల నుండి, ఇంతవరకు జీతాలు, రాలేకపోవడంతో, మా కుటుంబ నిత్య అవసరాలను తీర్చుకోవడం సైతం, అప్పు చేయాల్సి వస్తుందని, అప్పు చేసినా కట్టుకోలేని పరిస్థితిలో ఇబ్బందులు పడుతున్నామని, త్వరగా మా జీత పద్యాలు మాకు అందేలా చూడాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మండల విద్యాధికారులకు విజ్ఞతలు అందుతున్నాయి. గత ఐదు ఆరు నెలల నుండి వారికి జీతభత్యాలు ఇవ్వకుండా, వారి చేత, పాఠశాలల్లో పని చేయించుకుంటున్నారని స్కావెంజర్స్ మండల విద్యాధికారికి ఇచ్చిన వినతిపత్రంలో తెలిపారు.




## సోలార్ సీసీ కెమెరా అందజేత

**వీణవంక, జూలై 14(,జర్నలిస్ట్ డైరీ)**

వీణవంక మండలంలోని లస్మక్కపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మద్దుల ప్రశాంత్ పటేల్ తన వంతుగా సోలార్ సీసి కెమెరాను సోమవారం రోజు ఎస్సై ఆవుల తిరుపతికి అందజేశారు. అనంతరం ప్రశాంత్ మాట్లాడుతూ.. గ్రామాలలో ప్రజలకు రక్షణ కవచాలుగా పని పనిచేస్తూ, శాంతిభద్రతలకు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు.




## వృధాగా పోతున్న నీరు

- **నీటి సమస్యతో తీవ్ర ఇబ్బంది పడుతున్న ప్రజలు**
- **పలుమార్లు విన్నవించినా పట్టించుకోని అధికారులు**

**జర్నలిస్ట్ డైరీ, పరిగి జులై 14:**

వికారాబాద్ జిల్లాలో నేటికి పలు గ్రామాలలో నీటి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సౌకర్యం ఉన్నచోట సరిగ్గా వాడుకోలేక ప్రజలను అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు. వికారాబాద్ జిల్లా పరిగి మండలం మిట్టకోడూర్ గ్రామంలో చాలా రోజుల నుండి రాత్రి కాగానే మిషన్ భగీరథ ట్యాంక్ నిండి వృధాగా పోతూనే ఉన్నాయని గ్రామస్తులు అధికారులపై అసహణం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు సంబంధిత పంచాయతీ కార్యదర్శికి, అధికారులకు, వివరించిన ఫలితం లేకుండా పోయిందని, ట్యాంక్ నిండిన తర్వాత వృధాగా పోతున్న నీరుని ప్రజలకు ఉపయోగపడే విధంగా వెసులుబాటు కల్పించాలని, ట్యాంక్ నుండి వృధాగా పోతున్న నీరుని, గ్రామాలకు వెళ్లే పైప్ లైన్ కి అటాచ్ చేయమని చాలాసార్లు అధికారులు కోరడం జరిగిందని అన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నీరు వృధాగా పోకుండా అవసరాలకు వాడుకునే విధంగా వెసులుబాటు కల్పించాలని కోరారు.

# సాంప్రదాయ సౌరభం కూడా తోడైతే “అమరావతి” పరిపూర్ణం



ఒకవైపు అంతర్జాతీయ స్థాయి హంగులతో, అధునాతన జీవనశైలికి చిరునామాగా నిలిచే 'నోవాటెల్' హోటల్. దాని పక్కనే, ఘుమఘుమలాడే తెలుగు రుచులతో , మన సంస్కృతికి అద్దం పట్టే ఓ చిన్న 'పాక ఇడ్లీ' హోటల్. విజయవాడ నడిబొడ్డున కనిపించే ఈ దృశ్యం కేవలం రెండు భిన్నమైన హోటళ్ల కలయిక కాదు, ఇది నేటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైవిధ్యానికి, అందులో దాగి ఉన్న అంతర్గత బలానికి ఒక ప్రబల నిదర్శనం. ఈ స్ఫూర్తితోనే నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణం జరిగితే అందులో మన సంస్కృతి కూడా అంతర్లీన మైన సహజప్రవాహంగా ఉండిపోతుంది.

నోవాటెల్ ఇచ్చే విలాసవంతమైన అనుభూతి ఎంత గొప్పదో, పక్కనే ఉన్న పాక హోటల్‌లో రకరకాల ఆధరువులతో లభించే వేడివేడి ఇడ్లీ ,రుచి అంతకంటే గొప్పది. అది మన నేల రుచి, మన అమ్మ చేతి వంట రుచి. ఈ రుచిలోనే మన సంప్రదాయం, మన ఆప్యాయత దాగి ఉన్నాయి.


రుచుల ఘుమఘుమలను తరతరాలుగా కొనసాగిస్తున్న కర్నూలు రెడ్డి హౌటల్, తిరుపతి భీమాస్, నెల్లూరు కోమలా విలాస్, గుంటూరు ఆనంద భవన్, శంకర విలాస్, విజయవాడ బాబాయి హౌటల్, రామయ్యమెస్ రాజమండ్రి లలితా మెస్, గంగరాజు పాలకోవా, రాజానగరం వద్ద గోదావరి రుచులు (తూ గో on the go) ఆత్రేయపురం పూతరేకులు, కాకినాడ కోటయ్య కాజా, తాపేశ్వరం మడతకాజా, కాకినాడ సుబ్బయ్య హౌటల్, విశాఖ పట్టణం వెంకటాద్రి వంటిల్లు, సాయిరామ్ హౌటల్, మాడుగుల హల్వా మొదలైన ఎన్నెన్నో పాకశాలలు ప్రతి జిల్లాలో వున్నాయి. మూడు నాలుగు తరాలుగా కూడా ప్రత్యేకమైన రుచులు దెబ్బతినకుండా వ్యాపార పరంగా ఆహారసేవలు అందజేస్తున్నారు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలాంటి ఎన్నెన్నో సాంప్రదాయిక రుచులు సాంస్కృతిక వారసత్వ పరంపరగా అమరావతిలో అందజేయడానికి రాష్ట్ర రాజధాని నిర్మాణ ప్రణాళికలోనే చోటు వుంచాలి

సింగపూర్ నుండి మనం మౌలిక సదుపాయాల నిర్మాణాన్ని నేర్చుకోవచ్చునేమో కానీ, మన సాంస్కృతిక ఔన్నత్యాన్ని, మన జీవన విధానాన్ని ఏ దేశం నుండీ దిగుమతి చేసుకోలేం.

అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ సంకల్పం ప్రశంసనీయం. ఇందుకోసం సింగపూర్ వంటి అభివృద్ధి చెందిన దేశాల ప్రణాళికలను అధ్యయనం చేయడం, వారి సహకారం తీసుకోవడం హర్షణీయ పరిణామం. ఆకాశహర్మ్యాలు, విశాలమైన రహదారులు, అత్యాధునిక మౌలిక సదుపాయాలు ఒక నగరానికి అవసరమే. అయితే, ఈ అభివృద్ధి క్రమంలో మన అస్తిత్వాన్ని, మన మూలాలను మరచిపోతే ఆ అభివృద్ధి నిరర్థకం. అభివృద్ధి అంటే మన మూలాలను విస్మరించి పాశ్చాత్య పోకడలను గుడ్డిగా అనుకరించడం కాదు. మన సంప్రదాయమనే పునాదిపై ఆధునిక సౌకర్యాలనే సౌధాన్ని నిర్మించుకోవడమే నిజమైన అభివృద్ధి. నోవాటెల్ వైభవాన్ని ఆస్వాదిస్తూనే, పాక హోటల్ రుచిని మర్చిపోని వాళ్ళే నిజమైన ఆంధ్రులు. అమరావతి నగరం కూడా అదే విధంగా ప్రపంచానికి ఒక ఆదర్శ నగరంగా, ఆధునికతకు, సంప్రదాయానికి వారధిగా నిలవాలని ఆశిద్దాం.

సమతుల్య అభివృద్ధి ప్రణాళిక అవసరం కాబట్టి, అమరావతి నిర్మాణంలో ఈ రెండు అంశాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రణాళికలు కేవలం భవనాల నిర్మాణానికే పరిమితం కాకూడదు.
అమరావతి భవనాల డిజైన్లలో మన చారిత్రక వాస్తుశైలి, శిల్పకళ, సాంప్రదాయిక ఆహారసేవతో వంటశాలల వైభవం, ఉట్టిపడేలా చూడాలి.
కళలు, చేతివృత్తుల ప్రదర్శన, అమ్మకాల కోసం ప్రత్యేకంగా 'కళా గ్రామాలను' ఏర్పాటు చేయాలి.
మన సంస్కృతిని ప్రతిబింబించేలా మ్యూజియంలు, సాంస్కృతిక కేంద్రాలు, వేదికలను నిర్మించాలి.

**నవీన్**
**సీనియర్ జర్నలిస్ట్**



ప్రౌఢదేవరాయులకి కుష్టు వ్యాధి ఉందా???
"అవును"అని అంటున్నాయి కొన్ని శాసనాలు. విజయనగర సామ్రాజ్యాన్ని 1422 సంవత్సరంలో విజయ బుక్కరాయలు పరిపాలిస్తున్నాడు, ఇతడు మొదటి దేవరాయలు యొక్క కుమారుడు.
విజయ బుక్కరాయలు కి దేవరాయ,పర్వతరాయ, ప్రతాపదేవరాయ అనే ముగ్గురు కుమారులు, హరిహరాంబ అనే ఒక కుమార్తె జన్మించారు.
విజయ బుక్కరాయ మరణానంతరం ఆయన మొదటి కుమారుడు దేవరాయలు అధికారంలోకి వచ్చాడు. వీరి తాత పేరు కూడా దేవరాయలు అవటం చేత వీరిని రెండవదేవరాయలు అని పిలిచేవారు. ఇతనిని ఇమ్మడి దేవరాయలు,గజబెంట దేవరాయలు అని కూడ పిలిచేవారు. రెండవ దేవరాయలకు వేట యందు మక్కువ ఎక్కువ. ఇతడు సంగమ వంశస్థుడు. 1424వ సంవత్సరం నుండి 1446 సంవత్సరం వరకు విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించారు. విజయనగర రాజులలో విశేష కీర్తిని పొందిన వారు ఈ రెండవ దేవరాయలు. వీరి కాలంలోనే శ్రీనాథ మహాకవి సార్వభౌముడు నివసించాడు. ఈ రెండవ దేవరాయలు రైతు పక్షపాతిగా పాలించాడు. వ్యవసాయ అభివృద్ధికై సదుపాయాలను కూడా చేశాడు. అనేక తటాకాలు నిర్మించాడు.
రెండోదేవరాల రాయల మరణానంతరం మల్లికార్జున రాయులు విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించాడు. శాసనాల ఆధారంగా రెండవదేవరాయలు 1446వ సంవత్సరంలో మరణించాడని తెలియుచున్నది. అయితే రెండవదేవరాయులకు సంబంధించినటువంటి ఒక శాసనం ఈ మధ్యకాలంలో బయల్పడింది. ఈ నూతన శాసనం 1661 వ సంవత్సరం లిఖించబడినట్లుగా ఉన్నది. ఇందులో "శ్వేత శృంగగిరి ర్యత్ర కృష్ణా వౌత్తరవాహిణి । తత్ర స్నాణె । తధాచ । ప్రౌఢదేవరాయ కుష్ఠు రొగ నివృత్తి రత్రై వా భూదిత్యాఖ్యానం ప్రశస్తం" అని ఉంది. పై శాసనం ద్వారా ప్రౌఢ దేవరాయలు కు కుష్ఠు వ్యాధి సంక్రమించినదని,కృష్ణానది ఉత్తరంగా ప్రవహించే ఈ నందుల రేవు వద్ద స్నానం చేసారని, తద్వారా కుష్ఠువ్యాధి నుండి ఉపశమనం పొందరిని తెలియుచున్నది.
ఈ శాసనం పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం లోని జడపల్లి తండా లోని నందుల రేవు వద్ద ఇటీవల కాలం లో బయల్పడినది. తెలుగు లిపి గల ఈ శాసనం లో 34,35,36,37 పంక్తు లలో ఈ విషయం స్పష్టంగా వ్రాయబడినది.

**శ్రీనివాసప్రసాద్ తురిమెళ్ళ**

# సైబర్ మోసం.. రిఫండ్ చేస్తామని వృద్ధురాలి నుంచి డబ్బు కొట్టేశారు

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
అమెజాన్‌లో కొనుగోలు చేసిన వస్తువును రిటర్న్ చేయాలని ప్రయత్నించిన ఓ వృద్ధురాలిని సైబర్ కేటుగాళ్లు మోసగించారు. ఆమె నుంచి రూ.1.07లక్షలు కాజేశారు. వివరాల్లోకి వెళ్తే.. సికింద్రాబాద్‌కు చెందిన 60 ఏళ్ల వృద్ధురాలు ఇటీవల అమెజాన్‌లో ఓ వస్తువుని కొనుగోలు చేశారు. దాన్ని రిటర్న్ చేసి రిఫండ్ తీసుకోవాలని కస్టమర్ కేర్ నంబర్ కోసం గూగుల్‌లో వెతికారు. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లు ఆమెకు ఫోన్ చేసి రిఫండ్ చేస్తామని నమ్మించారు. స్క్రీన్ షేరింగ్ యాప్ డౌన్‌లోడ్ చేయించి బాధితురాలి మొబైల్‌ను అధీనంలోకి తీసుకున్నారు. రిఫండ్ కావట్లేదని, బ్యాంకు వివరాలు ఇవ్వాలని కోరడంతో వారికి ఆమె తన ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ అకౌంట్ వివరాలను ఇచ్చారు. వెంటనే ఆ రెండు బ్యాంక్ ఖాతాల్లోంచి రూ.1.07లక్షలు డెబిట్ అయ్యాయి. మోసపోయినట్లు గ్రహించిన బాధితురాలు.. హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# కల్తీ కల్లు దందాలో సిండికేటు!..

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
కాంగ్రెస్ పార్టీలో అతనొక ముఖ్యనేత. అందరూ గౌరవించాల్సిన పదవిలో ఉన్నా.. అతని ఆలోచనంతా ‘కల్తీ’ మయం. తన అనుచరులతో చేస్తున్న కల్తీ కల్లు గలీజు దందా అంతా ఇంతాకాదు. అతనితోపాటు హైదరాబాద్‌కు చెందిన కొందరు బీగ్రేడ్ కాంగ్రెస్ నాయకులు.. సంగారెడ్డి, రంగారెడ్డి, నిజామాబాద్, మహబూబ్‌నగర్‌కు చెందిన ఏ గ్రేడ్ కాంగ్రెస్ నేతలంతా కలిసి.. పెద్ద నెట్‌వర్క్‌గా ఏర్పడి ఈ కల్తీ కల్లు దందా నిర్వహిస్తున్నట్టు ‘నమస్తే తెలంగాణ’ పరిశోధనలో వెల్లడైంది. తాటిచెట్టు నుంచి లభించే కల్లు చుక్క కూడా లేకుండా.. మత్తు పదార్థాలతోనే రోజూ వేల లీటర్ల వ్యాపారం చేస్తున్నారని తెలుస్తున్నది. సొసైటీలు, కల్లుగీత కార్మికుల సభ్యత్వాలను అడ్డు పెట్టుకొని, రాష్ట్రంలో ఎక్కడికి సరుకు పంపాలి? ఎలా పంపాలి? ఏ స్థాయిలో పంపాలో.. పక్కా ప్లాన్‌తో ఎక్సైజ్ అధికారులను ‘మేనేజ్’ చేస్తున్న కల్తీ కల్లు నెట్‌వర్క్... మాఫియాను తలపిస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌లో నెట్‌వర్క్ మొత్తాన్ని హైదరాబాద్ సమీప జిల్లాలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నేత కనుసన్నల్లోనేజరుగుతున్నదని పలు గౌడ సంఘాల నేతలు చెప్తున్నారు. ఎక్సైజ్ అధికారులతో కలిసి బెదిరించడంతోపాటు, కల్తీకల్లు తయారు చేసే వారికి అవసరమైన ముడి పదార్థాల సరఫరా బాధ్యతను కూడా ఈ నెట్‌వర్క్ తీసుకుంటున్నదని విశ్వసనీయ సమాచారం. ఒక్క హైదరాబాద్ సమీప జిల్లాలోని మూడు మండలాల్లోనే అతని అనుచరులు రోజుకు రూ.34 లక్షల వ్యాపారం చేస్తున్నారని గౌడ సంఘాల నేతలు చెప్తున్నారు.



ఇటీవల ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఎక్సైజ్ నివేదికలోని వివరాల ప్రకారం లైసెన్స్ కలిగిన కల్లు దుకాణాలు 8,238 ఉన్నాయి. వీటిలో టీసీఎస్‌లు (సొసైటీలు) 3,824 ఉండగా.. వ్యక్తిగత లైసెన్స్‌లు (టీఎఫ్‌టీ)లు 4వేలకు పైగా ఉన్నాయి. వీటి ద్వారా సుమారు 2,25,000 మంది వృత్తిదారులు ఆధారపడగా.. అనధికారికంగా వీరి సంఖ్య లక్షల్లోనే ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి లాంటి జిల్లాలో 200 కల్లు దుకాణాలు ఉన్నాయి. తాటిచెట్టుపై కల్లు తీసి, ఆ చెట్టుకిందనే విక్రయించుకోవడానికి ప్రభుత్వం లైసెన్స్ ఇస్తుంది. ఆ లెసెన్సును ఆధారంగా చేసుకుని, నిబంధనలకు విరుద్ధంగా కల్లు తయారీ కేంద్రాల నుంచి తీసుకెళ్లి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. మన రాష్ట్రంలో కల్లుకు డిమాండ్ అధికంగా ఉండటంతో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, హైదరాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో ఈ కల్తీ కల్లు తయారీ కేంద్రాలు అధికంగా విస్తరించాయి. లెకకు మించి లైసెన్స్‌లు మంజూరు చేస్తున్న ఎక్సైజ్‌శాఖ తనిఖీలు చేయట్లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ శివారు ప్రాంతాల్లో కల్లు తయారు చేసే స్థావరాలు పుట్టగొడుగుల్లా పెరిగాయని స్థానికులు చెప్తున్నారు.

**లిక్విడ్ ప్రయోగం వికటించడం వల్లే!**
హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో కల్తీ కల్లు ఆరుగురిని బలి తీసుకుంది. ఈ ఘటన తెలంగాణలో చర్చనీయాంశంగా మారింది. కూకట్‌పల్లి, హైదర్‌నగర్, ఇందిరానగర్, శంషీగూడలోని కల్లు కాంపౌండ్లలో కల్తీ కల్లు తాగి పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ కల్లు కాంపౌండ్‌లకు ప్రముఖ కాంగ్రెస్ నేత నెట్‌వర్క్ నుంచి వచ్చిన మత్తు పదార్థాలే కారణమని తెలుస్తున్నది. ఇటీవల పౌడర్‌గా లభించే క్లోరల్ హైడ్రేట్ (సీహెచ్), డైజోపామ్, ఆల్ప్రాజోలంను లిక్విడ్‌గా మార్చి సరఫరా చేస్తున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పౌడర్‌గా ఉన్నవాటిని జెల్‌గా లేదా లిక్విడ్‌గా మార్చితే వాటి డోస్ రెట్టింపు అవుతుందని నిపుణులు చెప్తున్నారు. ఈ క్రమంలో సదరు నెట్‌వర్క్ ప్రయోగాత్మకంగా పౌడర్ నుంచి లిక్విడ్‌గా మార్చి హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి, ఎల్బీనగర్, ఎల్లమ్మబండ, హైదర్‌నగర్, ముషీరాబాద్, రాంనగర్, ఉప్పల్, నారాయణగూడ, కర్మన్‌ఘాట్ బస్తీల్లోని కల్లు కాపౌండ్‌లకు ఓ కాంట్రాక్టర్ పంపినట్టు తెలిసింది. కూకట్‌పల్లిలో ప్రయోగం వికటించడం, కల్తీకల్లు తాగినవారు చనిపోవడంతో వెంటనే మిగతా కేంద్రాలకు పంపిన కల్లును ధ్వంసం చేశారని విశ్వసనీయ సమాచారం. గీత కార్మికుల సంక్షేమం కోసం పాటుపడాల్సిన నాయకులే, వారిని వాడుకుంటూ, వారి జీవనాధారాన్ని దెబ్బతీస్తూ అక్రమ వ్యాపారాలకు పాల్పడటం విమర్శలకు తావిస్తున్నది. ఎక్సైజ్ అధికారులు కూడా ఈ అక్రమ దందాకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, సమగ్ర విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని గౌడ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# ఎగువ గోదారి వెలవెల!

**మొదటిపేజీ తరువాయి**
గోదావరి పోటెత్తింది.
గోదావరిలో ప్రాణహిత కలిసే కాళేశ్వరం వద్ద నిర్మించిన మేడిగడ్డ బరాజ్ నుంచి ధవళేశ్వరం బరాజ్‌కి దిగువన సముద్రంలో కలిసే వరకూ గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రాణహితలో వరద పెరగడంతో కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బరాజ్‌లోకి 2.21 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, వచ్చిన వరదను వచ్చినట్టు కిందికి విడుదల చేస్తున్నారు.
దానికి ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న ఇంద్రావతి వరద తోడవుతుండటంతో తుపాకులగూడెం (సమ్మక్క సాగర్) బరాజ్‌లోకి 2.69 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా అంతే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. సీతమ్మసాగర్ (దుమ్ముగూడెం బరాజ్) లోకి చేరుతున్న 5.92 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ఏపీలోని ధవళేశ్వరం బరాజ్ గేట్లను ఎత్తివేయడంతో ఇప్పటికే ఈ ఏడాది 175 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలోకి కలిసిపోయాయి.
గోదావరి ప్రధాన పాయపై ఉన్న శ్రీరామ్‌సాగర్ గరిష్ట నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా, కేవలం 2,100 క్యూసెక్కుల వరద వస్తుండగా, జలాశయంలో 20.77 టీఎంసీల నీరే ఉంది. కడెం నదిపై నిర్మించిన కడెం ప్రాజెక్టు సామర్థ్యం 4.7 టీఎంసీలు కాగా, 602 క్యూసెక్కుల వరద వస్తుండడంతో నిల్వలు 3.47 టీఎంసీలకు చేరాయి. గోదావరి ప్రధాన పాయపై ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు సామర్థ్యం 20.18 టీఎంసీలు కాగా, 431 క్యూసెక్కుల వరద మాత్రమే వస్తుండడంతో నిల్వలు 8.9 టీఎంసీలకు పరిమితమయ్యాయి.
కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా గోదావరి ప్రధాన పాయపై నిర్మించిన సుందిళ్ల, అన్నారం బరాజ్‌లకు సైతం నామమాత్రంగా 293 క్యూసెక్కులు, 450 క్యూసెక్కుల వరద మాత్రమే వస్తోంది. మేడిగడ్డతో పాటు అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో నీళ్లు నింపరాదని ఎన్డీఎస్‌ఏ సూచించింది. దీంతో మేడిగడ్డ బరాజ్‌కి భారీ వరద వస్తున్నా నీటిని ఎత్తిపోసే అవకాశం లేకుండా పోయింది.



# ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు సరికాదు

- **తెలంగాణ రాష్ట్ర బీసీ కార్యదర్శి జి విజయకుమార్**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 14 (జర్నలిస్ట్ డైరీ) :**

బీసీల రిజర్వేషన్ల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై చింతపండు నవీన్ అలియాస్ (తీన్మార్ మల్లన్న) చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర బీసీ కార్యదర్శి జి విజయ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చడం కోసం కల్వకుంట్ల కవిత తెలంగాణలోని జిల్లాలలో బీసీసదస్సులు, ధర్నాలు, దీక్షలు చేపడుతూ, ఢిల్లీలో కూడా మీడియా సమావేశం ఏర్పాటు చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చినా సందర్భంగానే రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ సమావేశంలో 42 శాతం రిజర్వేషన్ లకు కట్టుబడి ఉన్నాం అని చెప్పి ఆర్డినెన్స్ కు ఆమోదం తెలిపారని అన్నారు. ఈ సందర్భంగా జాగృతి ఆధ్వర్యంలో సంబరాలు చేసుకుంటే ఆ సంబరాలను పురస్కరించుకొని తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీగా, ఒక జర్నలిస్టుగా ఉంటూ ఎమ్మెల్సీ



కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసి మహిళలను కించపరిచే విధంగా మాట్లాడినందుకు ఎమ్మెల్సీ కవిత, తెలంగాణ మహిళ లోకానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మల్లన్న ఎమ్మెల్సీగా తెలంగాణ శాసనమండలి చైర్మన్ అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. ఇంతటి దిగజారుడు, నీచమైన మాటలను బహిరంగ సభలలో మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతిని పాడు చేస్తూ కవిత గౌరవాన్ని భంగపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని అడిగెందుకు వెళ్లిన జాగృతి నాయకులను భౌతికంగా దాడి చేయడమే కాకుండా కాల్పులు జరపడాన్ని తీవ్రంగా ఖండించారు.



# ఫోన్ల చోరీపై CEIR నివేదికలో నిజాలు బయటకు

- **దేశంలో నెలకు 50 వేలకుపైగా ఫోన్లు పోయిపోతున్నాయట**
- **కేవలం 15 శాతం మాత్రమే తిరిగి లభ్యమవుతున్నాయి**

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

ప్రస్తుతం ప్రతి ఒక్కరి జీవితంలో మొబైల్ ఫోన్ కీలక పాత్ర పోషిస్తోంది. కమ్యూనికేషన్ మొదలుకొని డేటా స్టోరేజ్, బ్యాంకింగ్, ఆన్‌లైన్ లావాదేవీలు ఇలా అన్నింటికీ మొబైల్ ఆధారంగా ఉంటుంది. అయితే ఈ అవసరాల మధ్య, ఫోన్ పోగొట్టుకోవడం లేదా దొంగతనానికి గురవడం అనేది పెద్ద సమస్యగా మారుతోంది.

**CEIR నివేదికలో నిజాలు బయటకు**

ప్రతి నెలా దేశవ్యాప్తంగా 50వేల కంటే ఎక్కువ మొబైల్ ఫోన్లు దొంగిలించబడుతున్నాయో లేక పోగొట్టుకున్నాయో CEIR (Central Equipment Identity Register) నివేదిక వెల్లడించింది. అయితే ఈ ఫోన్లలో కేవలం 15 శాతం మాత్రమే తిరిగి వినియోగదారులకు రికవర్ అవుతున్నాయి. మిగిలిన 85 శాతం ఫోన్లు కనుమరుగవుతున్నాయి. దీని వల్ల వినియోగదారులకు తీవ్ర అసౌకర్యం, ఆర్థిక నష్టం వాటిల్లుతోంది.

**CEIR ద్వారా IMEI బ్లాక్ చేయవచ్చు**

మొబైల్ మిస్ అయిన వెంటనే CEIR పోర్టల్ (https://www.ceir.gov.in) ద్వారా ఫోన్ IMEI నంబర్‌ను బ్లాక్ చేయవచ్చు. ఇది దొంగలు ఫోన్‌ను ఉపయోగించకుండా నిరోధించడానికి ఉపయోగపడుతుంది. అలాగే ఒకవేళ దొంగలు సిమ్ మార్చినప్పటికీ, ఫోన్ ట్రాక్ అయ్యే అవకాశం ఉంటుంది.

**నిపుణుల సూచన.. Find My Device తప్పనిసరి**

సైబర్ భద్రత నిపుణుల సూచన మేరకు, ప్రతి యూజర్ తన ఫోన్‌లో 'Find My Device' (Androidకు) లేదా 'Find My iPhone' (iOSకు) ఫీచర్‌ను ఎప్పుడూ ఎనేబుల్ చేయాలి. ఇది ఫోన్ మిస్ అయినపుడు గూగుల్ అకౌంట్ ద్వారా ఫోన్ స్థితిని లొకేషన్‌తో సహా ట్రాక్ చేయడాన్ని సులభతరం చేస్తుంది.

**లొకేషన్ సేవలు ఆన్‌లో ఉండాలి**

ఫోన్ స్థానం తెలుసుకోవాలంటే అందులో GPS లొకేషన్ ఆన్‌లో ఉండాలి. చాలా మంది డేటా సేవలు సేవ్ చేసేందుకు లొకేషన్ ఆఫ్ చేస్తారు. కానీ ఇది ఫోన్ మిస్ అయినపుడు దాన్ని ట్రాక్ చేయడంలో అడ్డంకిగా మారుతుంది.

**పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేయాలి**

ఫోన్ పోయిన వెంటనే అత్యవసరంగా దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో FIR నమోదు చేయాలి. ఈ FIR నంబర్ ద్వారా CEIRలో ఫోన్ బ్లాక్ చేయడం సాధ్యమవుతుంది. ఇలా చేయడం ద్వారా ఫోన్ ఉపయోగించడాన్ని నిరోధించొచ్చు.

**సామాన్య ప్రజలకు అవగాహన తక్కువే**

ఈ సేవలు అందుబాటులో ఉన్నా కూడా చాలా మందికి అవగాహన లేకపోవడమే ప్రధాన సమస్య. ఫోన్ పోయిన తర్వాత ఏమి చేయాలో తెలియక చాలా మంది ఖాళీచేతుల్తో తిరుగుతుంటారు. ప్రభుత్వం అందించిన సేవలు వినియోగించుకోవడం ద్వారా, ఫోన్‌ను తిరిగి పొందే అవకాశం పెరుగుతుంది.

రోజురోజుకీ డిజిటల్ ఆధారిత జీవితంలో మొబైల్ ఫోన్ల ప్రాముఖ్యత పెరుగుతున్న వేళ, వాటి భద్రతపై ప్రజలు ప్రత్యేకంగా శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది. 'Find My Device' వంటి ఫీచర్లతో పాటు CEIR సేవలు ఒక ఉపశమనం అయినా, అవగాహనతో ముందుగానే అప్రమత్తం కావడమే ఉత్తమ పరిష్కారం.

# పరిగి నియోజకవర్గ వ్యాప్తంగా మొదటి విడతలో ఆలయాల నిర్మాణానికి రూ.1.14.50 కోట్లు మంజూరు

- **మంత్రి కొండా సురేఖ**

**జర్నలిస్ట్ డైరీ, పరిగి జులై 14 :**

వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలో బోనాల పండుగను పురస్కరించుకొని రాష్ట్ర అటవీ పర్యావరణ & దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్థానిక పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించి,ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని, అమ్మవారికి హారతులు అర్పించారు. అనంతరం పరిగి పట్టణంలోని బహార్ పేట్ ఎస్సీ కాలనీలోరూ.5 లక్షలతో పోచమ్మ తల్లి గుడి నిర్మాణానికి, అదేవిధంగా బీసీ కాలనీలో రూ.5 లక్షలతో మైసమ్మ తల్లి గుడి నిర్మాణానికి, ఎస్సీ కాలనీలో రూ.5 లక్షలతో శ్రీ సీతారామాలయ కళ్యాణ మండపం నిర్మాణానికి మంత్రితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధి కోసం దశలవారీగా నిదురు మంజూరు చేసి ఆలయాల అభివృద్ధి చేస్తామని, స్థానిక ఎమ్మెల్యే చొరవతో ఆలయాలు నేర్పించబోతున్నామని, పరిగి నియోజకవర్గ వ్యాప్తంగా 8 ఆలయాల నిర్మాణ అభివృద్ధికి, మొదటి విడతలో రూ.1కోటి 14.50లక్షలు మంజూరు చేయడం జరిగిందని, గత ప్రభుత్వం ఆలయాలను లక్ష్యం చేసిందని, కానీ ఈ ప్రజా ప్రభుత్వం ఆలయాన అభివృద్ధిలో ముందుంటుందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక వాతావరణ రూపొందించేందుకు ఆలయాల అభివృద్ధి చేయాలని సంకల్పంతో ముందుకెళ్తున్నామని, త్వరితగతిన ఆలయాలు పూర్తి చేసి, మరికొన్ని కొత్త ఆలయాలు నియోజకవర్గ వ్యాప్తంగా నిర్మించబోతున్నామని తెలిపారు. అక్కడినుండి పరిగి



పట్టణంలో శ్రీనివాస్ నగర్ కాలనీలో అధికారులతో కలిసి మంత్రి కొండా సురేఖ ,స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ నాయక్, డీఎఫ్ఓ, తహసిల్దార్, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ బ్లాక్ అధ్యక్షులు పార్థసారథి, పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి,పట్టణ అధ్యక్షులు ఎర్రగడ్డపల్లి కృష్ణ,పరిగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండి. అయూబ్, డిసిసి ఉపాధ్యక్షులు లాల్ కృష్ణ, డిసిసి ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్,ప్రజా ప్రతినిధులు, అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణా, గోదావరి బేసిన్లో సమస్యలపై చొరవచూపాలి

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, నీటి కేటాయింపులు, అనుమతులు, కృష్ణా గోదావరి నదీ బేసిన్‌లలో సమస్యలపై కేంద్రం చొరవచూపాలని రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. సోమవారం కేంద్ర జల వనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ కు లేఖ రాశారు. పాలమూరురంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు ఇప్పటికీ క్లియరెన్స్ రాలేదన్నారు. పాలమూరుకు మైనర్ ఇరిగేషన్ కంపోనెంట్ నుంచి సేవింగ్స్ 45 టీఎంసీలు, గోదావరి నీటిని కృష్ణా నదికి బదిలీ చేయడం ద్వారా తెలంగాణకు రావాల్సిన 45 టీఎంసీలు ఈ ప్రాజెక్టు వినియోగించుకోవాలని ప్రతిపాదించిందన్నారు. గోదావరి వాటర్ డిస్ప్యూట్స్ ట్రిబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) అవార్డు ప్రకారం 45 టీఎంసీల కృష్ణా నీటిని నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ పైన వాడుకునే వీలుందని, ఆ నీటినే పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయించిందన్నారు. పాలమూరు, డిండి ప్రాజెక్టుల డీపీఆర్లను కేంద్ర జల సంఘం ఆమోదించాలని, ఆ తర్వాత పర్యావరణ శాఖ, సీసీకు ఈసీ జారీ చేయమని సిఫార్సు చేయాలన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం కారణంగా కరువు పీడిత ప్రాంతాల రైతులకు ఆశించిన ప్రయోజనాలు అందడం లేదన్నారు. ఈ ప్రాజెక్టులకు ఎన్విరాన్మెంటల్ క్లియరెన్స్ వస్తే కేంద్రం నుంచి గ్రాంట్లు, ఆర్థిక సాయంతో పాటు నాబార్డ్ లాంటి ఆర్థిక సంస్థల నుంచి తక్కువ వడ్డీతో రుణాలు పొందే వీలుంటుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందే 2007లోనే డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ఆమోదం పొందిందని, ఫ్లోరోసిస్ సమస్యను పరిష్కరించే లక్ష్యంతో డిండి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా పరిగణించాలని ప్రధాన మంత్రి కార్యాలయం 2010 డిసెంబర్ 10న ప్రతిపాదించిందన్నారు. 2021 సెప్టెంబర్ 21న కేంద్ర జలసంఘానికి సమ్మక్క సాగర్ ప్రాజెక్ట్ (తుపాకులగూడెం బ్యారేజ్) డీపీఆర్ సమర్పించిందని వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి నోఆబ్జెక్షన్ లేనందున ఇంటర్‌స్టేట్ మ్యాటర్స్ డైరెక్టరేట్ నుంచి క్లియరెన్స్ ఆలస్యమవుతోందని, ఛత్తీస్‌గఢ్ సూచనలను, నిబంధనల ప్రకారం అక్కడి భూ యజమానులకు నష్టపరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ముంపు విషయంలో ఖరగ్పూర్ ఐఐటీ ఇచ్చిన నివేదిక లోని సిఫారసులను పాటించేందుకు సిద్ధంగా ఉందని వెల్లడించారు. కృష్ణా బేసిన్లో శ్రీశైలం నుంచి ఇతర బేసిన్లకు ఏపీ అక్రమంగా నీటిని మళ్లిస్తోందని మండిపడ్డారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి +880 అడుగుల వద్ద 1.5 లక్షల క్యూసెక్క్ కంటే ఎక్కువ సామర్థ్యంతో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటిని మళ్లిస్తోందని, ఏకంగా 841 అడుగుల నుంచి రోజుకు 8 టీఎంసీల నీటిని మళ్లించేలా ఏపీ కాల్వల నిర్మాణాలు చేపట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 797 అడుగుల వద్ద రోజుకు 3 టీఎంసీలు తీసుకెళ్లే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ తో పాటు ముచ్చుమర్రి, మలయాల, గురు రాఘవేంద్ర ప్రాజెక్టులు నిర్మించిందని, కృష్ణా నది నుంచి వరద నీటిని బేసిన్ వెలుపల ప్రాంతాలకు డైవర్ట్ చేస్తుందన్నారు. శ్రీశైలం అట్టడుగు నుంచి నీటిని డైవర్ట్ చేసే నిర్మాణాలతో రిజర్వాయర్ ఖాళీ అవుతోందని, శ్రీశైలం, నాగార్జునసాగర్ మీద ఆధారపడ్డ జల విద్యుత్తు ఉత్పత్తిపై ప్రభావం పడుతోందన్నారు. రోజుకు 10 టీఎంసీల చొప్పున 20 రోజులలో 200 టీఎంసీలు డైవర్ట్ చేసే సామర్థ్యముండటంతో తెలంగాణలోని ఇన్‌బేసిన్ అవసరాలకు విఘాతం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావానికి ముందే కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో 287.06 టీఎంసీల సామర్థ్యంతో వివిధ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని, కేడబ్ల్యూడీటీ-2 ముందు ఈ వాదనలను వినిపించామని, ఈ విచారణ త్వరగా పూర్తి కావాలన్నారు. 1979లో ఎస్ఎల్బీసీ, 1984లో మొదలైన కల్వకుర్తి, 1997లో నెట్టెంపాడు, 2013లో పాలమూరు రంగారెడ్డి, 2007లో డిండి, 2005లో కొల్లాపూర్, 2014లో నారాయణపేట కొడంగల్ ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని, కేడబ్ల్యూడీటీI అవార్డు ప్రకారం చేపట్టిన ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం అనుమతులివ్వాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ఇతర బేసిన్లకు నీటిని మళ్లించడాన్ని కేఆర్ఎంబీ అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కృష్ణా జలాల మళ్లింపుపై నియంత్రణలు విధించాలని, ఇన్‌బేసిన్ అవసరాల విషయంలో కేఆర్ఎంబీ న్యాయంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. నీటి ప్రవాహాలను ఖచ్చితంగా లెక్కించేందుకు టెలిమెట్రీ అమలు చేయాలని, టెలీమెట్రి అమలుకు తెలంగాణ ప్రభుత్వం కేఆర్ఎంబీ ఖాతాకు రూ.4.15 కోట్లు జమ చేసిందన్నారు. ఇప్పటికీ ఏపీ పరిధిలో టెలీ మెట్రీ పనులు జరగలేదని, వీటిని వెంటనే ఏర్పాటు చేయాలని కేఆర్ఎంబీకి సూచించాలన్నారు. ఏపీ ప్రభుత్వం తుంగభద్ర నీటిని కేసీ కెనాల్ నుంచి హెచ్ఎల్సీ, ఎల్ఎల్సీ కెనాల్కు నీటిని డైవర్ట్ చేస్తోంది, ఇది కేడబ్ల్యూడీటీI అవార్డును ఉల్లంఘించటమే అవుతుందన్నారు. అవార్డు ప్రకారం తుంగభద్ర నుండి వచ్చే ప్రవాహాలు కృష్ణా నదికి రావాలని, దానికి విరుద్ధంగా ఏపీ అనుసరిస్తున్న తీరుపై ఇప్పటికే తుంగభద్ర బోర్డుకు లేఖలు రాశామన్నారు. నాగార్జునసాగర్, కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి, డిండి, ఎస్ఎల్బీసీ ఆయకట్టుకు నీటి కొరతతో పాటు శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల లో గ్రీన్ పవర్ ఉత్పత్తి తగ్గిపోతోందన్నారు. తెలంగాణకు జీవనాడిగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహితచేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్ట్ చేపట్టిందని, ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఏఐబీపీ కింద ఆర్థిక సాయం అందించాలని కోరారు. గోదావరి బేసిన్ నుండి ఇతర బేసిన్‌లకు నీటిని బదిలీ చేసే విషయంపై చర్చలు జరగాల్సిన అవసరముందన్నారు. తెలంగాణలోని కరువు పీడిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అవసరాలు తీర్చేందుకు 200 టీఎంసీల వరద నీటిని ఉపయోగించుకునేలా ఇచ్చంపల్లి వద్ద కొత్త ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించాలని, గోదావరిపై పోలవరం, ఇచ్చంపల్లి ప్రాజెక్టులు చేపట్టమని జీడబ్ల్యూడీటీ పేర్కొందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నిధులు సమకూర్చుతున్నందున, అంతే సమానంగా ఇచ్చంపల్లి ప్రాజెక్టుకు కేంద్రం నిధులు సమకూర్చాలని విజ్ఞప్తిచేశారు.




# వింబుల్డన్ స్టార్లకు ఇష్టమైనవి 'మేక్ ఇన్ ఇండియా' టవల్లే..! విదేశాల్లో భారత్ హవా..!

- **'మేక్ ఇన్ ఇండియా' గుర్తింపు ప్రపంచవ్యాప్తంగా కీర్తిప్రతిష్టలు**
- **తాజాగా అంతర్జాతీయ క్రీడా రంగంలోనూ ప్రభావం**
- **భారతదేశంలో తయారైన టవల్లను వాడిన వింబుల్డన్‌లో ఆటగాళ్లు**

'మేక్ ఇన్ ఇండియా' గుర్తింపు ప్రపంచవ్యాప్తంగా కీర్తిప్రతిష్టలు సంపాదిస్తోంది. తాజాగా అంతర్జాతీయ క్రీడా రంగంలోనూ దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రపంచ ప్రఖ్యాత టెన్నిస్ టోర్నమెంట్ వింబుల్డన్‌లో పాల్గొనే ప్రముఖ ఆటగాళ్లు భారతదేశంలో తయారైన టవల్లను విశేషంగా మెచ్చుకుంటున్నారు. ఈ టవల్ల నాణ్యత, డిజైన్, మృదుత్వం వింబుల్డన్ స్టార్లను ముచ్చటపెట్టేలా చేసింది.

అంతేకాకుండా, ఈ టవల్లను కొన్ని ప్రముఖ టెన్నిస్ ప్లేయర్లు వింబుల్డన్ మైదానాల్లో ఉపయోగించి, ఆట ముగిసిన తర్వాత తమ ఇంటికి తీసుకెళ్లిపోతున్నారని సమాచారం. ఇప్పటికే ఈ టవల్లకు సోషల్ మీడియాలో మంచి క్రేజ్ వచ్చింది. అంతర్జాతీయ మ్యాచ్‌లలో భారత ఉత్పత్తుల పట్ల చూపుతున్న ఆదరణ మేక్ ఇన్ ఇండియా ప్రోగ్రామ్ విజయాన్ని స్పష్టం చేస్తోంది.

ఇక టవల్లతో పాటు, భారతదేశంలో తయారవుతున్న కార్లకు కూడా విదేశాల్లో ఆదరణ పెరుగుతోంది. ముఖ్యంగా జపాన్ వంటి దేశాల్లో ఇండియన్ మేడ్ వాహనాల డిమాండ్ గణనీయంగా పెరిగింది. యాంత్రిక నైపుణ్యం, అతి తక్కువ ఖర్చులో అధిక నాణ్యత కలిగిన తయారీ సామర్థ్యం భారత్‌కు ఈ గుర్తింపును తీసుకొచ్చింది.

ఇవన్నీ కలిసి చూస్తే, "మేక్ ఇన్ ఇండియా" అనే కాన్సెప్ట్ కేవలం నినాదంగా కాకుండా, గ్లోబల్ మార్కెట్లలో నాణ్యతకు మారుపేరుగా మారుతోంది. క్రీడలు, ఆటోమొబైల్స్, గృహోపయోగ వస్తువులు ఇలా అనేక రంగాల్లో భారత తయారీకి పెరుగుతున్న గౌరవం దేశపు ప్రతిష్టను మరింతగా బలోపేతం చేస్తోంది.



# అర్ధరాత్రి జర్నలిస్ట్ ఖాజా పాషా (కేపీ) కారు అద్దాలు ధ్వంసం..

- **పోలీసులకు ఫిర్యాదు చేయనున్న ఖాజా పాషా**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 14 (జర్నలిస్ట్ డైరీ) :**

షాద్ నగర్ సీనియర్ జర్నలిస్ట్ ఎండి ఖాజాపాష (కేపీ) తార్ జీప్ కారు అద్దాలను ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి ధ్వంసం చేశారు. ఇటీవల పలు అంశాల మీద ఆసక్తికరమైన కథనాలను అందిస్తూ నిజాలు నిర్భయంగా రాస్తున్న జర్నలిస్ట్ కెపి వార్తల్లో నిలిచాడు. దీనితో అతనిపై అక్కసు తోనే ఎవరో ఈ దారుణానికి ఒడిగట్టి ఉంటారని భావిస్తున్నారు. ఆయన ఇంటి పక్కన గల పార్కింగ్ స్థలంలో చాలా కార్లు పదుల సంఖ్యలో నిలబడి ఉంటాయి. కానీ ప్రత్యేకంగా ఖాజా పాషా కారును మాత్రమే టార్గెట్ చేసి అద్దాలను పగలగొట్టారు. వాహనం వెనుక భాగాన్ని పూర్తిగా విధ్వంసం చేశారు. 12 గంటలు దాటక సిసి ఫుటేజ్ లో నమోదైన అంశాలను పరిశీలిస్తే ఆ సమయంలో కుక్కలు కారు వద్దకు వచ్చి అరిచాయి. కారు అద్దాన్ని ధ్వంసం చేసిన శబ్దాలు పెద్దగా వినిపించాయి. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఖాజా పాషా తెలిపారు. వాస్తవాలు వెలుగులోకి తెస్తున్నందుకే తట్టుకోలేని కొందరు నాయకులు ఈ విధ్వంసానికి పాల్పడి ఉంటారని, వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు సంఘాలు కోరుతున్నాయి. కాగా దీనిపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

# మున్సిపల్ కు కేటాయించిన 10 శాతం భూమిలో అక్రమ నిర్మాణాలపై సోలిపూర్ యువకుల ఫిర్యాదు

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 14 (జర్నలిస్ట్ డైరీ) :**

షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని సోలిపూర్ గ్రామంలో ప్రభుత్వ నిబంధనల మేరకు మున్సిపాలిటీకి కేటాయించిన 10 శాతం భూమిని కొందరు ఆక్రమించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సర్వే నంబర్లు 30, 31లో ఉన్న ఒక ప్రైవేట్ బిల్డింగ్ బ్లాక్స్ వెంచర్ అభివృద్ధి సమయంలో, పార్కులు, కమ్యూనిటీ హాల్‌లు, ఇతర అవసరాల కోసం 10 శాతం స్థలాన్ని మున్సిపాలిటీకి అప్పగించినట్టు తెలిపారు. అయితే ప్రస్తుతం ఆ భూమిపై కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని యువ నాయకుడు సింగపగ అనిల్ కుమార్, గ్రామస్తులు బాబు, సోమ్లూ, రవి, సురేష్, మున్నా, కిషోర్, ప్రకాష్, నరేష్ లు పేర్కొన్నారు. ఈ పరిస్థితిని వెంటనే నివారించాలని కోరుతూ వారు మున్సిపల్ కమిషనర్ సునీత గారిని కలిసి ఫిర్యాదు చేశారు. వారి వినతిని స్వీకరించిన కమిషనర్, పూర్తి






వివరాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


# వేధింపులు తాళలేక యువకుడి అదృశ్యం..

- **మెహిదీపట్నం పోలీసు స్టేషన్ లో కేసు నమోదు**
- **షోరూం నిర్వాహకుల వేధింపులు తట్టుకోలేక పోతున్న**
- **ఆత్మహత్య చేసుకుంటానని**
- **లెటర్ రాసి అదృశ్యమైన చంపాపేట యువకుడు**
- **సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన కుటుంబీకులు**



**- జర్నలిస్ట్ డైరీ, సరూర్ నగర్ (జులై 14) :**

బైక్ షోరూంలో జరిగిన ఆర్థిక లావాదేవీల విషయంపై మెహిదీపట్నం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న చంపాపేట డివిజన్ కు చెందిన యువకుడు తాను షోరూం నిర్వాహకులు, పోలీసుల వేధింపులు తాళలేకపోతున్నానని ఇంట్లో లెటర్ రాసి అదృశ్యమైన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే... చంపాపేట డివిజన్ లోని ప్రెస్ కాలనీలో ఉన్న ఎంఎంఆర్ అపార్ట్ మెంట్ లో కె.జంగయ్య, అండాలు దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు సందీప్ కుమార్ మెహిదీపట్నంలోని ఒక బైక్ షోరూంలో పని చేస్తున్నాడు. అక్కడి షోరూంలో జరిగిన ఆర్థిక లావాదేవీల విషయంపై నిర్వాహకులు హుమాయున్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ప్రీతిరెడ్డి కేసు దర్యాప్తు చేసి సందీప్ కుమార్ ను నిందితుడిగా చేర్చారు. ఈ క్రమంలో సందీప్ కుమార్ నిర్వాహకులతో మాట్లాడి ముందుగా ఒప్పందం ప్రకారం రూ, 10 లక్షలు చెల్లించాడు. అయితే, ఈ ఒప్పందాన్ని షోరూం ఓనర్ అంగీకరించలేదు. మిగతా నగదుపై ఎలాంటి హామీ లేదని, నగదు మొత్తం చెల్లించాలని. నగదు ఇవ్వకుంటే కుటుంబ సభ్యులపై కేసు పెడుతానని సందీప్ పై ఒత్తిడి తెచ్చాడు. తాను రూ,10 లక్షలు చెల్లించినా, ఇంకా ఒత్తిడి తెస్తున్నారని,ఇంటికి వచ్చి పరువు తీస్తున్నారని, తల్లిదండ్రులతోపాటు చెల్లెలుపై కేసు పెడతామని షోరూం నిర్వాహకులు బెదిరిస్తున్నారని సందీప్ స్నేహితులతో చెప్పుకున్నాడు. ఒత్తిడి తీవ్రం కావడంతో సందీప్ కుమార్ మనస్తాపానికి గురయ్యాడు. జరిగిన విషయాన్ని ఒక పేపర్ పై రాసి, తాను ఆత్మహత్య చేసుకుంటానని, అమ్మానాన్న క్షమించాలని పేర్కొంటూ సందీప్ సోమవారం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఫోన్, బైక్ ఇంట్లోనే వదిలిపెట్టి వెళ్లిపోయాడు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు సరూర్ నగర్ పోలీసులను ఆశ్రయించారు.సీఐ సైదిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.



# మరోసారి ఢిల్లీ బాట.. రేపు హస్తినకు సీఎం చంద్రబాబు..

- మరోసారి ఢిల్లీ పర్యటనకు ఏపీ సీఎం చంద్రబాబు..
- రేపు ఉదయం అమరావతి నుంచి ఢిల్లీ చేరుకోన్న సీఎం..
- మూడు రోజుల పాటు కొనసాగనున్న పర్యటన..

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు.. మరోసారి హస్తిన పర్యటనకు సిద్ధం అయ్యారు.. రేపు ఉదయం అమరావతి నుంచి ఢిల్లీ వెళ్లనున్నారు చంద్రబాబు. ఉదయం.. 9.45కి విజయవాడ ఎయిర్‌పోర్ట్ నుంచి ఢిల్లీకి బయల్దేరి.. ఉదయం 11.45 కు ఢిల్లీ చేరుకుంటారు సీఎం చంద్రబాబు.. ఇక, మధ్యాహ్నం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీకానున్నారు.. ఆ తర్వాత, కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్, ఢిల్లీ మెట్రో రైల్ ఎండీలతోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం కాబోతున్నారు.. ఇక, రేపు సాయంత్రం 4.30 గంటలకు ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం లైబ్రరీలో జరుగనున్న మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించనున్నారు ఏపీ సీఎం చంద్రబాబు.. ఎల్లుండి కేంద్ర కార్మిక ఉపాధి కల్పనా మంత్రి మన్సుఖ్ మాండవీయతో సమావేశం కానున్న ఆయన.. ఆ తర్వాత నార్త్ బ్లాక్ లో కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ తో ప్రత్యేకంగా భేటీ అవ్వనున్నారు.. ఎల్లుండి సాయంత్రం భారత పరిశ్రమల సమాఖ్య నిర్వహించే బిజినెస్ కాన్ఫరెన్స్‌కు హాజరుకానున్నారు.. ఈ నెల 17వ తేదీ ఉదయం 9.30 గంటలకు ఢిల్లీ నుంచి అమరావతికి తిరుగు ప్రయాణం కానున్నారు ఏపీ సీఎం చంద్రబాబు..

APPSC

# నిరుద్యోగులకు గుడ్‌న్యూస్.. నోటిఫికేషన్ విడుదల చేసిన ఏపీపీఎస్సీ..

- నిరుద్యోగులకు శుభవార్త చెప్పిన ఏపీపీఎస్సీ..
- అటవీ శాఖలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ..
- 691 బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం ఉద్యోగ కల్పనపై దృష్టిపెట్టింది.. ఓవైపు ప్రైవేట్ సెక్టార్‌లో పెట్టుబడులు ఆకర్షించి.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తోంది ప్రభుత్వం.. మరోవైపు, వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీపై ఫోకస్ పెట్టింది.. ఇప్పటికే మెగా డీఎస్సీపై ముందడుగు వేసిన ప్రభుత్వం.. ఇతర శాఖల్లోనూ ఖాళీలు పూర్తి చేస్తోంది.. తాజాగా, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (APPSC) నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది.. అటవీ శాఖలో ఖాళీ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది.. అటవీశాఖలో 691 బీట్ ఆఫీసర్.. అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ అయ్యింది.. ఈ నెల 16వ తేదీ నుండి ఆగష్టు 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని ఇచ్చింది.. ఇక, ఏపీపీఎస్సీ.. అటవీ శాఖలో 691 బీట్ ఆఫీసర్.. అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీ కోసం జారీ చేసిన నోటిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి సమాచారం కోసం.. https://psc.ap.gov.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు..



# తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన టీడీపీ ఎమ్మెల్యే..! మీ పెత్తనం ఏంటి..?

- మరోసారి టీడీపీ నేతలపై ఎమ్మెల్యే ఆదిమూలం అసంతృప్తి..
- పార్టీకి దూరంగా ఉన్నంత మాత్రాన...?
- ఒక ఎమ్మెల్యేనే పక్కనపెట్టి మీరే పనులు చేసుకుంటారా..?

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

సొంత పార్టీ నేతలపై మరోసారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం.. టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై ఓ మహిళ ఫిర్యాదు చేసిన తర్వాత.. ఆ ఎపిసోడ్ ఎన్నో మలుపులు తిరిగింది.. అయితే, అప్పటి నుంచి పార్టీ ఆయన్ని పక్కకు పెట్టేసిందనే విమర్శలు ఉన్నాయి.. ఈ విషయంపై ఇప్పటికే అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన.. ఈ రోజు సత్యవేడులో అన్న క్యాంటిన్ ప్రారంభోత్సవం సందర్భంగా మరోసారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.. పార్టీకి దూరంగా ఉన్నంత మాత్రాన...? ఒక ఎమ్మెల్యేనే పక్కనపెట్టి మీరే పనులు చేసుకుంటారా..? అని ప్రశ్నించారు.. ఒకరి కోఆర్డినేటర్, మరొకరు పరిశీలకుడు అంటారు.. ఎంతమంది పెత్తనం చెలాయిస్తారు సత్యవేడుపై అంటూ ఫైర్ అయ్యారు. ఒక ప్రజా ప్రతినిధిగా ఉన్న నాకు కాకుండా బయట వ్యక్తులకు ఎస్పీ ఎలా సెల్యూట్ చేస్తారు...? అని ప్రశ్నించారు ఆదిమూలం.. శంకర్ రెడ్డికి నాకు మధ్య ఎంతో అనుబంధ ఉంది.. కానీ, రిజర్వ్ నియోజవర్గంలో ఇలా చేయమని సీఎం చంద్రబాబు ఎప్పుడు చెప్పలేదన్నారు.. కొంతమంది గొర్రెల్లాగా ఎవరు వెంటపడితే వారి వెంట వెళ్తున్నారు.

# ఢిల్లీకి తెలుగు రాష్ట్రాల నీటి పంచాయితీ.. ఎల్లుండి సీఎంల భేటీ..

- నీటి వాటాలపై తేల్చుకునేందుకు సిద్ధమైన తెలుగు రాష్ట్రాలు..
- ఇరు రాష్ట్రాల సీఎంల హస్తినబాట..
- ఎల్లుండి మధ్యాహ్నం 2.30 గంటలకు ఢిల్లీలో భేటీ..
- ఏపీ, తెలంగాణ సీఎంల భేటీని ఫిక్స్ చేసిన జలశక్తి శాఖ..



**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

నీటి వాటాలపై తేల్చుకునేందుకు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హస్తినబాట పడుతున్నారు.. ఎల్లుండి మధ్యాహ్నం 2.30 గంటలకు ఢిల్లీలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సీఎంల సమావేశం ఖరారైంది.. ఈ విషయాన్ని కేంద్ర జలశక్తి శాఖ ఖరారు చేసింది.. ఢిల్లీ వేదికగా ఎల్లుండి మధ్యాహ్నం తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశం కాబోతున్నారు.. ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రి సమావేశాన్ని ఫిక్స్ చేసింది జలశక్తి శాఖ.. ఎల్లుండి మధ్యాహ్నం 2.30 గంటలకు జరగనున్న ఈ భేటీలో రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలు, ప్రాజెక్టులపై చర్చించనున్నారు ముఖ్యమంత్రులు.. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ గత పర్యటనలో కేంద్ర జల శక్తి శాఖ మంత్రిని కలిశారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి.. ఈ నేపథ్యంలో.. ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.. అయితే, ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంతో సమస్యలు పరిష్కారం అవుతాయని స్పష్టం చేశారు జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్..

అయితే, ఇప్పటికే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన ఖరారు అయ్యింది.. రేపు ఉదయం అమరావతి నుంచి ఢిల్లీ వెళ్లనున్నారు చంద్రబాబు. ఉదయం.. 9.45కి విజయవాడ ఎయిర్‌పోర్ట్ నుంచి ఢిల్లీకి బయల్దేరి.. ఉదయం 11.45 కు ఢిల్లీ చేరుకుంటారు సీఎం చంద్రబాబు.. ఇక, మధ్యాహ్నం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీకానున్నారు.. ఆ తర్వాత, కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్, ఢిల్లీ మెట్రో రైల్ ఎండీలతోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం కాబోతున్నారు.. ఎల్లుండి కేంద్ర కార్మిక ఉపాధి కల్పనా మంత్రి మన్సుఖ్ మాండవీయతో సమావేశం కానున్న ఆయన.. ఆ తర్వాత నార్త్ బ్లాక్ లో కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ తో ప్రత్యేకంగా భేటీ అవ్వనున్నారు.. అయితే, ఇప్పటి వరకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన ఖరారు కాకపోయినా.. కేంద్ర జల శక్తి శాఖ.. తెలుగు రాష్ట్రాల సీఎంల సమావేశాన్ని ఖరారు చేయడంతో.. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి హస్తిన పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ కూడా విడుదల చేసే అవకాశం ఉంది.. మొత్తంగా కృష్ణా నది, గోదావరి నదుల్లో నీటి వాటపై, ఆ నదులపై ఇరు రాష్ట్రాల ప్రాజెక్టులపై చర్చించబోతున్నారు.



# తిరుపతి రైల్వే స్టేషన్‌లో టెన్షన్.. రెండు రైళ్లలో భారీ మంటలు

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

తిరుపతిలో రైలు ప్రమాదం చోటుచేసుకుంది. భీమాస్ హోటల్ వెనుక భాగంలో రైల్వే స్టేషన్ లో ఆగి ఉన్న రెండు రైళ్లలోని బోగీల నుంచి మంటలు ఎగిసిపడుతున్నాయి. రెండు బోగీలలో మంటలు వ్యాపించాయి. ఆ పరిసర ప్రాంతంలో దట్టమైన పొగలు అలుముకున్నాయి. అయితే ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ట్రాక్ మార్చుతున్న సమయంలో అగ్ని ప్రమాదం జరిగింది. వెంటనే రైల్వే సిబ్బంది అక్కడకు చేరుకుంది. వెంటనే మిగితా బోగీలను వేరు చేశారు. మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. ఈ రైలు అగ్నిప్రమాదం గురించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

రాయలసీమ, ఇషార్ ఎక్స్ ప్రెస్ రైళ్లలో మంటలు చెలరేగినట్టు అధికారులు పేర్కొన్నారు. లూప్ లైన్ లో ఆగి ఉన్న రెండు రైళ్లలో అగ్నిప్రమాదం సంభవించినట్టు తెలిపారు. ఫైర్ సిబ్బంది రెండు బోగీలలో మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నట్టు అధికారులు వివరించారు. ప్రయాణికులు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదని పేర్కొన్నారు.

# కుప్పంలో మహిళను కరెంట్ పోల్‌కు కట్టేసిన కేసులో ట్విస్ట్..! సొంత కొడుకే..


- కుప్పంలో మహిళలను కరెంట్ పోల్ కు కట్టేసిన వీడియో వైరల్..
- శాంతిపురం మండలం, తమ్మిగానిపల్లిలో ఘటన..
- సొంత కొడుకే డ్రామా ఆడినట్లుగా నిర్ధారించిన పోలీసులు..

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాతినథ్యం వహిస్తోన్న చిత్తూరు జిల్లా కుప్పంలో మహిళలను కరెంట్ స్థంభానికి కట్టేసిన వీడియోపై ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారిపోయింది.. అయితే, ఆ మధ్యే.. ఓ మహిళను చెట్టుకు కట్టేసిన ఘటన సంచలనం సృష్టించడం.. దానిపై తీవ్ర రాజకీయ దుమారం రేగడం.. ఆ తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు కూడా స్పందించి.. బాధిత మహిళకు అండగా నిలిచారు.. ఇప్పుడు, శాంతిపురం మండలం, తమ్మిగానిపల్లిలో ఓ మహిళను కరెంట్ పోల్‌కు కట్టేసిన వీడియో వైరల్ అయ్యింది.. దీనిపై స్పందించిన పోలీసులు.. క్లారిటీ ఇచ్చారు..

శాంతిపురం మండలం, తమ్మిగానిపల్లిలో సొంత కొడుకే తల్లిని కరెంట్ స్థంభానికి కట్టి డ్రామా ఆడినట్లు నిర్ధారించారు పోలీసులు.. బంధువులతో ఉన్న ఆస్థి తగాదాల విషయంలో తప్పుడు ప్రచారం కోసం తల్లిని డ్రిప్ పైపులతో కరెంట్ పోల్‌కు కట్టేశాడు కుమారుడు.. ఇక, తమ బంధువులు తన తల్లిని స్థంభానికి కట్టేశారని ఫేస్ బుక్‌లో ఓ వీడియో పెట్టాడు కుమారుడు సురేష్. ఇప్పటికే ఓ ఘటన జరడగం.. అది కాస్త వివాదం కావడం.. కొన్ని రోజుల వ్యవధిలోనే ఈ ఘటన కూడా వెలుగు చూడడంతో.. ఆ వీడియోను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు.. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టారు.. చివరకు, సానుభూతి కోసం కొడుకు సురేష్ డ్రామా ఆడాడని తేల్చారు.. సురేష్ పై కేసు నమోదు చేసిన పోలీసులు. తల్లిని స్థంభానికి కట్టేసి డ్రామా సృష్టించిన సురేష్‌ను అరెస్ట్ చేశారు..

# భక్తులకు ముఖ్య సూచన.. రెండు రోజులు ఆ దర్శనాలు రద్దు, కొనసాగుతున్న రద్దీ



**జర్నలిస్ట్ డైరీ, తిరుమల:**

తిరుమల వచ్చే భక్తులకు సూచన. మంగళ, బుధ వారాల్లో ప్రోటోకాల్ ప్రముఖులకు వీఐపీ బ్రేక్ దర్శనాలుంటాయి. సిఫారసు లేఖలు స్వీకరించబడవని వెల్లడించింది టీటీడీ. జూలై 15న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, జులై 16న ఆణివార ఆస్థానం సందర్భంగా కారణంగా వాటిని రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది.

తిరుమలలో రద్దీ ఏ మాత్రం తగ్గలేదు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు వెంకటేశ్వరుడ్ని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. వీకెండ్ సెలవుల కారణంగా భక్తుల రద్దీ అమాంతంగా పెరిగింది. శనివారం ఒక్కరోజు ఏకంగా 92 వేల భక్తులు స్వామిని దర్శించుకున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్1, నారాయణగిరి షెడ్లు భక్తులతో కిటకిటలాడాయి. క్యూలైన్లు రెండు కిలోమీటర్ల మేరా ఏర్పడింది. ఈ రద్దీ కారణంగా దర్శన సమయం మరింత పెరిగే అవకాశం ఉంది.సర్వదర్శనానికి 16 గంటలు సమయం పడుతోంది. ఎస్ఎస్‌డీ టోకెన్లు దొరక్క తిరుపతిలో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం స్వామని 80 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. శ్రీవారి హుండీకి 4.43 కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. సర్వదర్శనం కోసం దాదాపు 24 గంటలు సమయం పడుతోంది. తిరుమలకు వచ్చే శ్రీవారి భక్తులకు ముఖ్యమైన గమనిక. జులై 15న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమం జరగనుంది. జులై 16న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం కార్యక్రమం జరగనుంది. ఈ కారణంగా ఈ రెండు రోజుల పాటు వీఐపీ బ్రేక్ దర్శనాలు ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా ఇతరులకు రద్దు చేసింది. జులై 14, 15న వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించిన సిఫార్సు లేఖలు స్వీకరించబడవని పేర్కొంది.

తిరుమలలో ఏడాదికి నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తోంది టీటీడీ. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి ముందు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఆలయ శుద్ధి కార్యక్రమం ఉంటుంది. ఉదయం 6 గంటలకు తిరుమంజనం కార్యక్రమం మొదలవుతుంది. దాదాపు 5 గంటల పాటు జరుగుతుంది. ఆ తర్వాత స్వామికి ఆగమోక్తంగా పూజలు చేస్తారు.

మధ్యాహ్నం 12 గంటల నుండి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. ఆణివార ఆస్థానం సందర్భంగా జూలై 16న కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను రద్దు అయ్యాయి. తిరుమంజనం కారణంగా మంగళవారం నిర్వహించే అష్టదళ పాద పద్మారాధన సేవను రద్దు చేసింది.

ప్రతీ ఏడాది దక్షిణాయన పుణ్యకాలంలో కర్కాటక సంక్రాంతికి ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. తమిళులకు వారి కాలమానం ప్రకారం ఆణిమాసం చివరిరోజు ఉండనుంది. అందుకే దీనిని ఆణివార ఆస్థానం అంటారు. పూర్వం.. మహంతులు దేవస్థాన పరిపాలనను స్వీకరించిన రోజు కావడంతో ఆణివార ఆస్థానం రోజు. టీటీడీకి సంబంధించి ఆదాయ వ్యయాలు, నిల్వలకు సంబంధించి లెక్కలు మొదలయ్యేవి.

అయితే ధర్మకర్తల మండలి ఏర్పడిన తర్వాత ఆ పద్ధతిని మార్చిఏప్రిల్ మధ్యకు మార్చారు. ఈ ఉత్సవం రోజు ఉదయం బంగారు వాకిలి ముందు ఘంటా మండపంలో సర్వభూపాల వాహనంలో శ్రీ మలయప్పస్వామివారు కొలువు దీరుతారు. స్వామివారు ఉభయ దేవేరులతో, గరుత్మంతునికి అభిముఖంగా ఉంటారు.

మరో పీఠంపై సర్వసైన్యాధ్యక్షుడైన శ్రీవిష్వక్సేనులవారు దక్షిణాభి ముఖంగా ఉంటారు. ఉత్సవ మూర్తులతో పాటు ఆనంద నిలయంలోని మూల విరాట్టుకు ప్రత్యేక పూజలు, ప్రసాదాలు నివేదిస్తారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సహకరించవలసినదిగా భక్తులకు విజ్ఞప్తి చేసింది తిరుమల తిరుపతి దేవస్థానం.

# ఆపరేషన్ గరుడ.. దూకుడు మీదున్నహోంమంత్రి అనిత

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గంజాయి వ్యాప్తిని నియంత్రించడంలో.. ప్రభుత్వం చేపట్టిన కృషి ఫలితాలను ఇవ్వడం ప్రారంభించిందని.. హోమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. గతంలో ఏపీ గంజాయి హబ్‌గా పేరు గాంచిందని, ఇతర రాష్ట్రాల్లో గంజాయి పట్టుబడితే అది ఏపీ నుంచే వచ్చినదిగా భావించేవారని ఆమె గుర్తు చేశారు.

ఈ అంశాన్ని సమగ్రంగా ఎదుర్కొనేందుకు ముఖ్యమంత్రి ప్రతిపాదనతో.. 'ఈగల్' అనే ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశారని మంత్రి తెలిపారు. రవికృష్ణను డైరెక్టర్‌గా నియమించి ఈగల్‌ను కార్యాచరణలోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఈగల్ టీమ్ విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రిలలో మూడు ప్రాంతీయ కేంద్రాలతో పని చేస్తోంది. ఈ బలగం అన్ని కీలక మార్గాలను పర్యవేక్షిస్తూ, గంజాయి అక్రమ రవాణాను అరికట్టే కృషి చేస్తోంది.



ఏజెన్సీ ప్రాంతాల నుండి వచ్చే ప్రధాన రూట్లపై సీసీ కెమెరాలు, చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. దీంతో అక్రమ రవాణాపై అణిచివేత సాధ్యమైంది. ఇప్పటి వరకు మొత్తం 831 గంజాయి కేసులు నమోదు చేశామని ఆమె తెలిపారు.

గత ప్రభుత్వ పాలనపై విమర్శలు చేస్తూ, పాడేరు ప్రాంతంలో గంజా ఆయిల్ తయారీకి మిషన్లు పని చేశాయని, స్కూలు బ్యాగుల్లోకి కూడా గంజాయి ప్యాకెట్లు వెళ్లిపోయాయన్న దుస్థితి ఉన్నదని గుర్తు చేశారు. దీనికి విరుద్ధంగా ప్రస్తుత ప్రభుత్వం ఒక యజ్ఞంలా గంజాయి నిర్మూలన కోసం పనిచేస్తోందని స్పష్టం చేశారు.

ఈగల్ బలగం ద్వారా రోజూ ఎక్కడో ఒకచోట.. గంజాయి పదార్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ పేరుతో విద్యాసంస్థల సమీపాల్లో మత్తు పదార్థాల అమ్మకాన్ని.. నిరోధించే కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. క్యాట్‌పా యాక్ట్ ప్రకారం స్కూలులు, కళాశాలలకు 100 మీటర్ల పరిధిలో పొగాకు సంబంధిత వస్తువులు అమ్మకూడదని స్పష్టం చేశారు.

"ఆపరేషన్ గరుడ" కార్యక్రమంలో భాగంగా మెడికల్ షాపులపై దాడులు నిర్వహించామని, ప్రిస్క్రిప్షన్ లేని మందులు, వైట్ నర్, ఇంజెక్షన్లు అమ్మకుండా చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు.

గంజా పంటకు ప్రత్యామ్నాయంగా రైతులకు మద్దతుగా ప్రభుత్వం 40 లక్షల మొక్కలను పంపిణీ చేసినట్టు చెప్పారు. గంజా పంట కన్నా మంచి ఆదాయం ఇచ్చే మొక్కల వైపు రైతులను మళ్లించామని వివరించారు. గతంలో 20 వేల ఎకరాల్లో సాగయ్యే గంజాయి ఇప్పుడు 90 ఎకరాలకు తగ్గించామని, జీరో కల్టివేషన్ దిశగా పురోగమిస్తున్నామని ఆమె స్పష్టం చేశారు.

పురాతన కాలం నుంచి సాగు చేసినట్లు భావించే గంజాయి పంటకు భద్రంగా ప్రత్యామ్నాయ పంటలుగా సిల్వర్ ఓక్, ఇంటర్ క్రాప్స్ వంటి వాటిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. సిల్వర్ ఓక్ పంటకు మూడు సంవత్సరాల సమయం పడతుందని, ఆలోచించుకున్న వ్యవస్థతో మధ్య కాలంలో ఇతర పంటలు వేసుకునే విధంగా రైతులకు మార్గనిర్దేశం చేశామని చెప్పారు.

చివరగా, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 68,620 కిలోల గంజాయిని ధ్వంసం చేశామని ప్రకటించారు. ఇది ప్రభుత్వం కట్టుదిట్టంగా తీసుకున్న చర్యల ఫలితమని, మత్తు పదార్థాల విస్తృత వ్యాప్తిని అరికట్టే దిశగా ఇదొక గొప్ప మైలురాయిగా పేర్కొన్నారు.

గంజా రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం చేసిన ఈ కృషి.. దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తుందని హోంమంత్రి అనిత తెలిపారు.

# ఆంధ్ర ప్రీమియర్ లీగ్ వేలం..
# ఎవరెవరు ఎంత ధర పలికారంటే?

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (Andhra Premier League) లీగ్ సీజన్ 4 కోసం ఆటగాళ్ల వేలం ప్రక్రియ విశాఖపట్నంలోని ఓ హోటల్‌లో ప్రారంభమైంది. ఈసారి వేలంలో ఏడు జట్లు బరిలోకి దిగాయి. అవే రాయల్స్ ఆఫ్ రాయలసీమ, భీమవరం బుల్స్, సింహాద్రి వైజాగ్ లయన్స్, తుంగభద్ర వారియర్స్, విజయవాడ సన్‌షైనర్స్, కాకినాడ కింగ్స్, అమరావతి రాయల్స్. దాదాపు 500 మంది క్రీడాకారులు వేలంలోకి వస్తున్నారు. ఒక జట్టులో గరిష్ఠంగా 20 మందిని, కనిష్ఠంగా 18 మందిని తీసుకోవచ్చు. ఒక్కో గ్రూపు గరిష్ఠంగా ₹45 లక్షలు ఖర్చు చేయొచ్చు.
ఇక వేలానికి ముందు ఏడు జట్లు మొత్తంగా ఎనిమిది మంది ఆటగాళ్లను రిటైన్ చేసుకున్నాయి. వారిలో కేఎస్ భరత్ (కాకినాడ కింగ్స్), నితీశ్ కుమార్ రెడ్డి (భీమవరం బుల్స్), హనుమ విహారి (అమరావతి రాయల్స్), రికీ భుయ్ (సింహాద్రి వైజాగ్ లయన్స్), షేక్ రషీద్ (రాయల్స్ ఆఫ్ రాయలసీమ), అశ్విన్ హెబ్బార్ (విజయవాడ సన్‌షైనర్స్), శశికాంత్, స్టీఫెన్ (తుంగభద్ర వారియర్స్) ఉన్నారు.

**వేలంలో ఎవరెంత ధర పలికారంటే?(₹2 లక్షలకు పైబడిన)**

పైల అవినాశ్ ₹11.5 లక్షలు (రాయల్స్ ఆఫ్ రాయలసీమ)
పీవీ సత్యనారాయణ రాజు ₹9.8 లక్షలు (భీమవరం బుల్స్)
త్రిపురాన విజయ్ ₹7.55 లక్షలు (సింహాద్రి వైజాగ్ లయన్స్)
సౌరభ్ కుమార్ ₹8.8 లక్షలు (తుంగభద్ర వారియర్స్)
వై.పృథ్వీరాజ్ ₹8.05 లక్షలు (విజయవాడ సన్‌షైనర్స్)
జి.మనీష్ ₹3.45 లక్షలు (కాకినాడ కింగ్స్)
ఎం.ధీరజ్ కుమార్ ₹6.5 లక్షలు (విజయవాడ సన్‌షైనర్స్)
పి.తపస్వి ₹5.3 లక్షలు (కాకినాడ కింగ్స్)
బి.వినయ్ కుమార్ ₹7.5 లక్షలు (అమరావతి రాయల్స్)
కె.కరణ్ శిందే ₹3.5 లక్షలు (అమరావతి రాయల్స్)




ఎం.వంశీ కృష్ణ ₹6.5 లక్షలు (విజయవాడ సన్‌షైనర్స్)
పి.గిరినాథ్ రెడ్డి ₹10.5 లక్షలు (రాయల్స్ ఆఫ్ రాయలసీమ)
బి. యశ్వంత్ ₹6.5 లక్షలు (సింహాద్రి వైజాగ్ లయన్స్)
ఎస్‌డీఎన్ వర ప్రసాద్ ₹9.5 లక్షలు (అమరావతి రాయల్స్)
ఎ.లలిత్ మోహన్ ₹3.25 లక్షలు (విజయవాడ సన్‌షైనర్స్)
కేపీ సాయి రాహుల్ ₹4.75 లక్షలు (కాకినాడ కింగ్స్)
కె.సుదర్శన్ ₹3.25 లక్షలు (కాకినాడ కింగ్స్)
ఎం.హరి శంకర్ రెడ్డి ₹4.5 లక్షలు (భీమవరం బుల్స్)
ఎం.హేమంత్ రెడ్డి ₹8.5 లక్షలు (భీమవరం బుల్స్)
ఎస్.ధ్రువ కుమార్ రెడ్డి ₹3 లక్షలు (రాయల్స్ ఆఫ్ రాయలసీమ)
టి.వరుణ్ సాత్విక్ ₹2.2 లక్షలు (తుంగభద్ర వారియర్స్)
కె.హనీశ్ వీర రెడ్డి ₹4.2 లక్షలు (సింహాద్రి వైజాగ్ లయన్స్)
ఎం.అభిషేక్ రెడ్డి ₹4.4 లక్షలు (సింహాద్రి వైజాగ్ లయన్స్)
సీఆర్ జ్ఞానేశ్వర్ ₹4.2 లక్షలు (తుంగభద్ర వారియర్స్)
జి. రోహిత్ ₹4.8 లక్షలు (తుంగభద్ర వారియర్స్)
డీబీ ప్రశాంత్ కుమార్ ₹2.2 లక్షలు (తుంగభద్ర వారియర్స్)
షేక్ కమరుద్దీన్ ₹5.2 లక్షలు (కాకినాడ కింగ్స్)
జె.సాకేత్ రామ్ ₹2.2 లక్షలు (రాయల్స్ ఆఫ్ రాయలసీమ)
వై.వాసు ₹2.2 లక్షలు (విజయవాడ సన్‌షైనర్స్)
ఎస్‌హెచ్ శ్రీనివాస్ ₹2 లక్షలు (కాకినాడ కింగ్స్)
కేఎస్ఎన్ రాజు ₹2.2 లక్షలు (విజయవాడ సన్‌షైనర్స్)
కె.మహీప్ కుమార్ ₹3.2 లక్షలు (తుంగభద్ర వారియర్స్)
ఎస్.ఆశిష్ ₹2.6 లక్షలు (రాయల్స్ ఆఫ్ రాయలసీమ)
ఎస్‌వీ రాహుల్ ₹3 లక్షలు (అమరావతి రాయల్స్)
గిరీశ్ కుమార్ రెడ్డి ₹2.2 లక్షలు (సింహాద్రి వైజాగ్ లయన్స్)
లెఖాజ్ రెడ్డి ₹2.4 లక్షలు (కాకినాడ కింగ్స్)
పి.పాండురంగ రాజు ₹2 లక్షలు (అమరావతి రాయల్స్)



# లార్డ్స్ టెస్టు.. పోరాడి ఓడిన భారత్

లార్డ్స్: ప్రతిష్ఠాత్మక లార్డ్స్ స్టేడియంలో ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో టెస్టులో భారత్ పోరాడి ఓడింది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 22 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. 193 పరుగుల లక్ష్యఛేదనలో.. 58/4తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన గిల్ సేన 170 రన్స్‌కు ఆలౌటైంది. రవీంద్ర జడేజా (61*; 181 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) గొప్పగా పోరాడి జట్టును గెలుపు అంచుల వరకు తీసుకొచ్చాడు. మహ్మద్ సిరాజ్ (4; 30 బంతుల్లో) పదో వికెట్‌గా వెనుదిరిగాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 3, బెన్ స్టోక్స్ 3, బ్రైడన్ కార్స్ 2, క్రిస్ వోక్స్, షోయబ్ బషీర్ ఒక్కో వికెట్ పడగొట్టారు. ఈ విజయంతో ఐదు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లాండ్ 21తో ఆధిక్యంలోకి వెళ్లింది.

**82 పరుగులకే 7 వికెట్లు**

నాలుగో రోజే యశస్వి జైస్వాల్ (0), కరుణ్ నాయర్ (14), శుభ్‌మన్ గిల్ (6), ఆకాశ్ దీప్ (1) పెవిలియన్‌కు చేరగా.. ఐదో రోజు ఆటలో తొలి గంటలోనే భారత్ మూడు వికెట్లు కోల్పోయింది. రిషభ్ పంత్ (9; 12 బంతుల్లో 2 ఫోర్లు)ని ఆర్చర్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. 33 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో ఆటను మొదలుపెట్టిన కేఎల్ రాహుల్ మరో ఆరు పరుగులు చేసి బెన్ స్టోక్స్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. తర్వాత ఓవర్‌లోనే వాషింగ్టన్ సుందర్ (0) ఆర్చర్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చాడు. దీంతో భారత్ 82 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్రమంలో జడేజా, నితీశ్ రెడ్డి భారత్‌ను ఆదుకునే ప్రయత్నం చేశారు. నితీశ్‌ని క్రిస్ వోక్స్ వెనక్కి పంపడంతో 30 పరుగుల భాగస్వామ్యానికి (90 బంతుల్లో) తెరపడింది. ఈ క్రమంలోనే 112/8తో భారత్ లంచ్‌కు వెళ్లింది.

**బుమ్రా సపోర్ట్‌తో ముందుకు.. ఆఖర్లో ఉత్కంఠ**

లంచ్ తర్వాత బుమ్రా (5; 54 బంతుల్లో 1 ఫోర్) సపోర్ట్‌తో జడేజా ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ జోడీని విడదీయడానికి ఇంగ్లాండ్ పేసర్లు చెమటోడ్చారు. బుమ్రా ఇంగ్లాండ్ పేసర్లకు అవకాశం ఇవ్వకుండా వికెట్ కాపాడుకున్నాడు. మరో ఎండ్‌లో జడేజా నిలకడగా సింగిల్స్ తీస్తూ లక్ష్యాన్ని కరిగించాడు. అయితే, బుమ్రాను స్టోక్స్ ఔట్ చేయడంతో 35 పరుగుల (131 బంతుల్లో) భాగస్వామ్యానికి తెరపడింది. ఈ క్రమంలో మ్యాచ్ ఫలితం తేలుతుందేమోనని సెషన్‌ను అర గంట పొడగించారు. కానీ, సిరాజ్ .. సహకారంతో భారత్‌ను జడేజా విజయం దిశగా నడిపించాడు. స్టోక్స్ బౌలింగ్‌లో ఫోర్ కొట్టి జడేజా అర్ధ శతకం (150 బంతుల్లో) అందుకున్నాడు. కాసేపటికి టీ విరామం ప్రకటించారు. చివరి సెషన్‌లో భారత్ విజయానికి 30 పరుగులు అవసరమైన దశలో ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో ఇంగ్లాండ్ భారత బ్యాటర్లపై ఒత్తిడి పెంచింది. బషీర్ బౌలింగ్‌లో జడేజా నుంచి స్ట్రైక్ అందుకున్న సిరాజ్.. బ్యాక్‌ఫుట్ తీసుకుని బంతిని డిఫెండ్ చేశాడు. కానీ, బంతి అతని పక్క నుంచి వెళ్లి స్టంప్స్ తాకగా బెయిల్ కిందపడింది. దీంతో భారత్ ఆలౌటైంది.





## సైనా నెహ్వాల్ సంచలన ప్రకటన..
## ఏడేళ్ల వివాహ బంధానికి గుడ్ బై

- **సైనా నెహ్వాల్ సంచలన ప్రకటన**
- **ఏడేళ్ల వివాహ బంధానికి గుడ్ బై**

స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ సైనా నెహ్వాల్ సంచలన ప్రకటన చేసింది. ఏడేళ్ల వివాహ బంధానికి గుడ్ బై చెబుతున్నట్లు తెలిపింది. తన దీర్ఘకాల భాగస్వామి పారుపల్లి కశ్యప్ నుంచి విడిపోతున్నట్లు ప్రకటించింది. సైనా తన ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో ఒక ప్రకటన విడుదల చేసి ఈ విషయాన్ని తెలియజేసింది. సైనా, పారుపల్లి 7 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నారు. ఇద్దరూ హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందారు. కలిసి ఈ క్రీడలో పురోగతి సాధించారు. ఇద్దరూ 2018లో వివాహం చేసుకున్నారు.

2012లో లండన్ ఒలింపిక్స్‌లో సైనా నెహ్వాల్ కాంస్య పతకాన్ని గెలుచుకుంది, 2015లో ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానానికి చేరుకోవడం ద్వారా చరిత్ర సృష్టించింది. ప్రపంచ నంబర్ వన్ షట్లర్‌గా నిలిచిన తొలి భారతీయ మహిళా క్రీడాకారిణి ఆమె. క్రీడలలో సైనా భారతదేశానికి ప్రపంచ ఐకాన్‌గా నిలిచింది. 2014లో గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో పారుపల్లి కశ్యప్ బంగారు పతకాన్ని సాధించాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి చేరుకున్నాడు. అంతర్జాతీయ స్థాయిలో స్థిరమైన మంచి ప్రదర్శనతో అతను తనకంటూ ఒక గుర్తింపును సంపాదించుకున్నాడు.
ఆదివారం రాత్రి తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో సైనా నెహ్వాల్ ఒక షాకింగ్ స్టేట్‌మెంట్ విడుదల చేసింది. ఆమె ఇలా రాసింది, 'జీవితం కొన్నిసార్లు మనల్ని వేర్వేరు దిశల్లోకి తీసుకెళుతుంది. చాలా ఆలోచించిన తర్వాత, కశ్యప్ పారుపల్లి, నేను విడిపోవాలని నిర్ణయించుకున్నాము. మేము మా కోసం, ఒకరికొకరు శాంతి, ఎదుగుదల, స్వస్థతను ఎంచుకుంటున్నాము. ఈ సమయంలో మా గోప్యతను అర్థం చేసుకుని గౌరవించినందుకు ధన్యవాదాలు.' కాగా కశ్యప్ ఇంకా ఎటువంటి ప్రకటన విడుదల చేయలేదు.

**భారత్ లో బ్యాడ్మింటన్‌ను పునరుద్ధరించిన సైనా**

ప్రకాష్ పదుకొనే, పుల్లెల గోపీచంద్ తర్వాత, ఏ భారతీయ క్రీడాకారిణి కూడా ప్రపంచ స్థాయిలో బ్యాడ్మింటన్‌లో తన ముద్ర వేయలేకపోయింది. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోవడం ద్వారా భారత్ లో ఈ క్రీడకు కొత్త ప్రాణం పోసింది సైనా నెహ్వాల్. నాలుగు సంవత్సరాల తరువాత, 2012 లండన్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించడం ద్వారా ఒలింపిక్ పోడియంకు చేరుకున్న మొదటి భారతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా ఆమె నిలిచింది.
2010 ఢిల్లీ కామన్వెల్త్ క్రీడల్లో కాంస్య పతకం సాధించడం ద్వారా పారుపల్లి కశ్యప్ వార్తల్లో నిలిచాడు. నీలుకా కరుణరత్నెపై విజయం సాధించడం ద్వారా 2012 లండన్ ఒలింపిక్స్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ పురుష బ్యాడ్మింటన్ ఆటగాడిగా నిలిచాడు. 2014 గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో బంగారు పతకం సాధించడం ద్వారా అతను చరిత్ర సృష్టించాడు. 32 సంవత్సరాల తర్వాత ఈ ఘనత సాధించిన తొలి భారత పురుష బ్యాడ్మింటన్ ఆటగాడు ఆయన. 2004లో, గోపీచంద్ హైదరాబాద్‌లో తన బ్యాడ్మింటన్ అకాడమీని స్థాపించినప్పుడు, వారిద్దరూ అతని వద్ద శిక్షణ ప్రారంభించారు. ఇక్కడే వారు ప్రేమలో పడ్డారు.

# మేజర్ లీగ్ క్రికెట్ టోర్నీ
# విజేతగా ఎంఐ న్యూయార్క్

మేజర్ లీగ్ క్రికెట్ టోర్నీ విజేతగా ఎంఐ న్యూయార్క్ నిలిచింది. ఫైనల్‌లో వాషింగ్టన్ ఫ్రీడమ్‌పై ఐదు పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూయార్క్ 180/7 స్కోరు చేసింది. డికాక్ (77) హాఫ్ సెంచరీ చేశాడు. అనంతరం లక్ష్య ఛేదనలో వాషింగ్టన్ ఐదు వికెట్ల నష్టానికి 175 పరుగులు మాత్రమే చేయగలిగింది.




**రచిన్, ఫిలిప్స్ రాణించినా..**

భారీ లక్ష్య ఛేదనలో వాషింగ్టన్‌కు తొలి బంతిలోనే షాక్ తగిలింది. ముంబయి బౌలర్ బౌల్ట్ వేసిన బంతిని ఆడబోయిన ఓపెనర్ మిచెల్ ఓవెన్ (0) మోనాంక్ పటేల్‌కు క్యాచ్ ఇచ్చాడు. అనంతరం వచ్చిన ఆండ్రీస్ గౌస్ (0)ను కూడా బౌల్ట్ పెవిలియన్‌కు చేర్చాడు. ఈసారి పొలార్డ్ అద్భుతమైన క్యాచ్ పట్టాడు. అయితే, రచిన్ రవీంద్ర (70), జాక్ ఎడ్వర్డ్స్ (33) మూడో వికెట్‌కు 45 బంతుల్లోనే 84 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను నిలబెట్టేందుకు ప్రయత్నించారు. ఎడ్వర్డ్స్ ఔటైనప్పటికీ గ్లెన్ ఫిలిప్స్ (48*)తో కలిసి రచిన్ 46 పరుగుల భాగస్వామ్యం నిర్మించాడు. రచిన్ ఔటయ్యాక వచ్చిన గ్లెన్ మ్యాక్స్‌వెల్ (15) వేగంగా ఆడలేకపోయాడు. కీలక సమయంలో ఔటై నిరాశపరిచాడు. చివరి ఓవర్‌లో 12 పరుగులు అవసరమైన క్రమంలో గ్లెన్ ఫిలిప్స్ కేవలం ఒక్క బంతిని ఆడే అవకాశం మాత్రమే వచ్చింది. దానికి ఓ సింగిల్ కొట్టాడు. భారీ హిట్టర్ మ్యాక్సీ విఫలం కావడమే వాషింగ్టన్ ఓటమికి ప్రధాన కారణం. న్యూయార్క్ బౌలర్లలో బౌల్ట్ 2, రుషి ఉగార్కర్ 2, కెంజిగె ఒక వికెట్ తీశారు.

**డికాక్ సూపర్ ఇన్నింగ్స్**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూయార్క్‌కు భలే ఆరంభం దక్కింది. తొలి వికెట్‌కు మోనాంక్ పటేల్ (28)తో కలిసి డికాక్ 72 పరుగుల భాగస్వామ్యం నిర్మించాడు. ఆ తర్వాత తేజిందర్(14) త్వరగా ఔటైనప్పటికీ.. పూరన్‌తో (21)తో డికాక్ ఇన్నింగ్స్‌ను ముందుకుతీసుకెళ్లాడు. ఈక్రమంలో అర్ధశతకం పూర్తి చేశాడు. వాషింగ్టన్ బౌలర్లు విజృంభించి డికాక్ (77)తో పాటు పొలార్డ్ (0), బ్రాస్‌వెల్ (4), ట్రిస్టన్ లూస్ (2) వికెట్లను పడగొట్టారు. అయితే, కున్వార్‌జీత్ సింగ్ (22*) ఆఖర్లో దూకుడుగా ఆడి జట్టు స్కోరు 180కి చేర్చాడు. వాషింగ్టన్ బౌలర్లు లాకీ ఫెర్గూసన్ 3.. నేత్రావల్కర్, మ్యాక్స్‌వెల్, జాక్ ఎడ్వర్డ్స్, హోలాండ్ తలో వికెట్ తీశారు.

## గత 110 ఏళ్ల టెస్టు చరిత్రలో టాప్ బౌలర్‌గా బోలాండ్.. ఐదో స్థానంలో బుమ్రా


వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడో టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియా పేసర్ స్కాట్ బోలాండ్ (Scott Boland) అరుదైన ఘనత సాధించాడు. విండీస్‌పై తొలి ఇన్నింగ్స్‌లో బోలాండ్ 13.1 ఓవర్లు వేసి 34 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీశాడు. దీంతో 1915 తర్వాత టెస్టు క్రికెట్ చరిత్రలో (కనీసం 2000 బంతులు వేసిన) అత్యంత బెస్ట్ బౌలింగ్ ఎకానమీతో బంతు లేసిన బౌలర్‌గా నిలిచాడు. ప్రస్తుతం అతడి బౌలింగ్ యావరేజీ 17.33. ఓవరాల్‌గా టెస్టు చరిత్రలో బోలాండ్ కంటే ముందు ఏడుగురు మాత్రమే ఉన్నారు. వీరిలో ఆరుగురు 1900 సంవత్సరం కంటే ముందు కాగా.. ఇంగ్లాండ్ బౌలర్ జీఏ లోమన్ 10.75 సగటుతో టాప్‌లో కొనసాగుతున్నాడు. 1900 తర్వాత ఇంగ్లాండ్‌కే చెందిన బర్న్స్ మాత్రమే (19011914) బోలాండ్ కంటే ముందుండటం గమనార్హం. బర్న్స్ బౌలింగ్ సగటు 16.53. ఈ జాబితాలో భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా 19.48 సగటుతో ఐదో స్థానంలో ఉన్నాడు.

**ఆసక్తికరంగా మూడో టెస్టు..**

బౌలింగ్‌కు అనుకూలించిన కింగ్‌స్టన్ పిచ్‌పై విండీస్ ఆసీస్ మూడో టెస్టు ఆసక్తికరంగా మారింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 225 పరుగులకు ఆలౌట్ కాగా.. ఆతిథ్య జట్టు కూడా మొదటి ఇన్నింగ్స్‌లో 143 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఆసీస్‌కు 82 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ బౌలర్ల దెబ్బకు ఆస్ట్రేలియా తడబాటుకు గురైంది. రెండోరోజు ఆట ముగిసే సమయానికి 99 పరుగులకే ఆరు వికెట్లను కోల్పోయింది. ప్రస్తుతం క్రీజ్‌లో కామెరూన్ గ్రీన్ (42*), పాట్ కమిన్స్ (5*) ఉన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

## కరీనా సైజ్ జీరో రహస్యం.. అసలు విషయం చెప్పిన డైటీషియన్



సినీతారలు ఎంత నాజూగ్గా ఉంటే, అన్ని రోజులు ఇండస్ట్రీలో మనగలుగుతారు. అవకాశాలు తలుపు తట్టాలంటే నోరు కట్టుకోవాల్సిందే. ఈ విషయంలో బాలీవుడ్ తారలు మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటారు. 'సైజ్ జీరో' ట్యాగ్‌కు పర్‌ఫెక్ట్ నిర్వచనం కరీనా కపూర్. 2008లో వచ్చిన 'తషాన్' నుంచి ఆమెకు డైటీషియన్‌గా వ్యవహరిస్తున్న రుజుత దివికర్ ఆ సీక్రెట్‌ను తాజాగా బయటపడ్డారు. ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చినా, వయసు 40 దాటినా కరీనా ఇప్పటికీ నాజూగ్గా ఉండటం వెనుక రహస్యాన్ని తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. గత 18ఏళ్లగా కరీనా ఒకే రకమైన ఆహార నియమాలు పాటిస్తున్నట్లు తెలిపారు.

''కరీనా తన రోజును డ్రైఫ్రూట్స్‌తో ప్రారంభిస్తారు. రాత్రంతా నానబెట్టిన బాదం, కిస్‌మిస్, అంజీరా తీసుకుంటారు. వ్యాయామం తర్వాత ఫ్రెష్ అయి, అల్పాహారంగా పరాటా లేదా పోహా ఎక్కువగా తింటారు. భోజన విరామం వరకూ మంచి నీళ్లు తాగుతారు. మధ్యాహ్నం లంచ్‌లో అన్నం, పప్పు ఉండాల్సిందే. ఇక సాయంత్రం కొన్నిసార్లు చీజ్ టోస్ట్ తీసుకుంటారు. దీనితో పాటు, కాలాన్ని బట్టి లభించే తాజా పండ్లు తింటారు. వేసవిలో ఎక్కువగా మామిడి పండ్లు నేరుగా లేదా మిల్క్ షేక్ రూపంలో తీసుకుంటారు. ఇక రాత్రి భోజనం నెయ్యితో చేసిన కిచిడీ లేదా పులావ్‌తో ముగిస్తారు. షూటింగ్‌లో సమయంలో ఈ మెనూలో కొన్ని మార్పులు ఉంటాయి. అక్కడ లభించే అన్నం, పప్పుతో సరిపెట్టుకుంటారు. షూటింగ్ లేని రోజుల్లో ఇంట్లో చేసే రోటీ, కూర ఉండాల్సిందే. కరీనా వారంలో ఐదు రోజులు నెయ్యితో చేసిన కిచిడీ తినేందుకు ఆసక్తి చూపుతారు'' అని దివికర్ పంచుకున్నారు.

కరీనా కపూర్ కూడా తన డైట్ గురించి ఈ సందర్భంగా మాట్లాడారు. ''10-15 రోజులు అదే పప్పు-అన్నం, పెరుగన్నం చేసి నా వంట మనిషి విసిగిపోతాడు. 'మేడమ్.. ఇక నేను ఏ వంట చేయాలి' అంటాడు. కానీ, నాకు మాత్రం రోజూ తిన్నా కూడా ఏమీ అనిపించదు. సాయంత్రం 6 గంటలకు డిన్నర్ అయిపోతుంది. రాత్రి 9.30 గంటలకు నిద్ర పోవాల్సిందే. ప్రపంచం నిద్రలేవక ముందే నా వర్కవుట్స్ పూర్తవుతాయి. నా స్నేహితులు కూడా నన్ను రాత్రి పార్టీలకు పిలవడం మానేశారు. నా శరీరాకృతి చూసి, నేను ఎక్కువగా క్వినోవా తీసుకుంటానన్న ప్రచారం ఉంది. అందులో నిజం లేదు'' అని కరీనా చెప్పుకొచ్చింది.

## అమ్మకి ఫోన్ చేసి ఏడ్చా.. సినిమా వదిలేయాలని అనుకున్నా

గోవా బ్యూటీ ఇలియానా గురించి పరిచయం అక్కర్లేదు. టాలీవుడ్ ఇండస్ట్రీలో చాలా కాలం పాటు స్టార్ హీరోయిన్ గా కెరియర్ను కొనసాగించింది. 'దేవదాసు' అనే సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయిన ఈ బ్యూటీ తన అందంతో , నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. దాంతో ఈ మూవీ తర్వాత నుంచి ఈమెకు అదిరిపోయే రేంజ్ క్రేజీ సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. కానీ ఇండస్ట్రీలో హీరోయిన్ ల కెరీర్ గురించి తెలియంది కాదు.. అవకాశాలు వచ్చినట్లే వచ్చి ఆగిపోతాయి. ఇలియాన విషయంలో కూడా ఇదే జరిగింది. దీంతో ఈ అమ్మడు బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చి అక్కడ కూడా మంచి క్రేజ్ సంపాదించుకుంది. ప్రజంట్ ఇండస్ట్రీకి దూరంగా ఉండి.. తల్లి మాతృత్వాన్ని ఆస్వాదిస్తోంది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఇలియానా సినీ ప్రయాణంలో ఒక కీలక మలుపు గురించి పంచుకుంది..



'సినీ రంగం బాహ్యంగా గ్లామరస్‌గా కనిపించినా, వాస్తవానికి చాలా ఒత్తిడులు, భావోద్వేగాలతో కూడి ఉంటుంది. ముఖ్యంగా 'దేవదాసు' సినిమా టైమ్‌లో ఎదుర్కొన్న కష్టం ఎప్పటకి మర్చిపోలేను. ఫస్ట్ సినిమా కావడం వల్ల, సెట్స్‌లో కొత్త వాతావరణం, భాష, వర్క్ కల్చర్ వల్ల ఒత్తిడి ఎక్కువయ్యింది. దీంతో మా అమ్మకి ఫోన్ చేసి "సినిమా వదిలేస్తానని" ఏడ్చిన.. ఆ సమయంలో తల్లి ధైర్యం చెప్పడం వల్లే ఆమె ఆ సినిమాను పూర్తి చేయగలిగాను. ఈ సంఘటన నా జీవితాన్ని మార్చేసింది. అదే సినిమా నన్ను స్టార్ గా నిలిపింది. ఒత్తిడిలోనూ ధైర్యంగా ముందుకెళ్లడం ఎంత అవసరమో,మన కుటుంబ సభ్యుల మద్దతు కూడా అంతే ముఖ్యం' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ అమ్మడు మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## మన సినిమాలు వెల వెల.. హాలీవుడ్ సినిమాలు కాసుల గలగల

గత కొన్ని రోజులుగా అగ్రతారల సినిమాలు.. ఆసక్తికర చిత్రాలు లేక ఇండియన్ బాక్సాఫీస్ వెల వెలబోతోంది. వచ్చిన ఒకట్రెండు చిత్రాలు ఆశించిన విజయాన్ని అందుకోలేక చతికిలపడ్డాయి. ఈ అవకాశాన్ని హాలీవుడ్ మూవీస్ అందిపుచ్చుకున్నాయి. గత మూడు వారాలుగా వారానికొకటి చొప్పున మూడు హాలీవుడ్ సినిమాలు విడుదలయ్యాయి. ఈ మూడు మంచి వసూళ్లతో రాణిస్తుండటం విశేషం..




**రూ.67 కోట్లు రాబట్టిన ఎఫ్ 1..**

బ్రాడ్ పిట్ నటించిన ఎఫ్ 1 (F1) మూవీ జూన్ 27న రిలీజైంది. ఈ చిత్రానికి జోసెఫ్ దర్శకత్వం వహించారు. స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో రూపొందిన ఈ మూవీ ఇప్పటివరకూ రూ.67 కోట్లు రాబట్టినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఇప్పటికీ మెట్రో సిటీస్‌లో ఆక్యుపెన్సీ బాగుందట. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా దాదాపు 400 మిలియన్ డాలర్లను కలెక్ట్ చేయడం విశేషం.

**భారీ వసూళ్లతో 'జురాసిక్ వరల్డ్: రీబర్త్'**

'జురాసిక్ వరల్డ్: రీబర్త్' (Jurassic World: Rebirth) జులై 4న విడుదలైంది. డైనోసర్ నేపథ్యం కలిగిన చిత్రాలు భారీ కలెక్షన్లు రాబడతాయని మరోసారి ఈ మూవీ నిరూపించింది. మహర్షలా అలీ (Mahershala Ali), స్కార్లెట్ జాన్సన్ (Scarlett Johansson) నటించిన ఈ చిత్రం ఇప్పటి వరకు దాదాపు రూ.73 కోట్లను వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం.


**సత్తా చాటుతున్న 'సూపర్ మ్యాన్'**

సూపర్ మ్యాన్ (Superman).. జేమ్స్ గన్ (James Gunn) దర్శకత్వం వహించిన ఈ సినిమా ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో దాదాపు రూ.25.50 కోట్లను రాబట్టింది. గత చిత్రాలకు పూర్తి భిన్నంగా యాక్షన్‌తో పాటు, వినోదాన్ని మేళవించి జేమ్స్ ఈ మూవీని తీర్చిదిద్దాడు. ఈ మూడు హాలీవుడ్ చిత్రాలు ఇప్పటి వరకు సుమారు రూ.165 కోట్లకు పైగా వసూలు చేశాయి. మూడు వారాలుగా భారతీయ బాక్సాఫీస్ వద్ద విడుదలైన సినిమాలేవీ మెప్పించకపోవడం వీటికి కలిసి వచ్చిందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.

## కోట శ్రీనివాసరావును పడేసి కొట్టబోయిన ఎన్టీఆర్ అభిమానులు..ఎందుకో తెలుసా ?

- **కోట శ్రీనివాసరావుపై విజయవాడలో అభిమానుల దాడి! కోట నటనను ఎన్టీఆర్ ప్రశంసించినప్పటికీ, అభిమానుల ఆగ్రహం**

తెలుగు సినీ పరిశ్రమలో విలక్షణ నటుడిగా పేరు పొందిన కోట శ్రీనివాసరావు కెరీర్‌లో 'మండలాధీశుడు' చిత్రం ఒక వివాదాస్పద ఘట్టంగా నిలిచిపోయింది. ఈ సినిమాలో ఆయన పోషించిన పాత్ర, దివంగత ఎన్టీ రామారావు (ఎన్టీఆర్) జీవితంలోని కొన్నిసంఘటనలను వ్యంగ్యంగా అనుకరించినట్లు భావించడంతో, ఎన్టీఆర్ అభిమానులు తీవ్రంగా ఆగ్రహించారు. ఈ క్రమంలో విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద కోట శ్రీనివాసరావుపై దాడి జరిగిన సంఘటన తెలుగు సినీ పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది. 1980ల చివరలో విడుదలైన 'మండలాధీశుడు' చిత్రంలో కోట శ్రీనివాసరావు ఒక కీలక పాత్రలో నటించారు. ఈ సినిమా సూపర్‌స్టార్ కృష్ణ తెరకెక్కించారు. అప్పటికే ఎన్టీఆర్ , కృష్ణ మధ్య విభేదాలు ఉన్న నేపథ్యంలో, ఈ చిత్రంలో కోట శ్రీనివాసరావు పాత్ర ఎన్టీఆర్‌ను వ్యంగ్యంగా చిత్రీకరించినట్లు అభిమానులు భావించారు. కోట ఆ పాత్రలో ఎన్టీఆర్ హావభావాలు, డైలాగ్ డెలివరీని అనుకరించడం వల్ల అభిమానుల ఆగ్రహం మరింత పెరిగింది. సరిగ్గా ఇదే సమయంలో విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద జరిగిన ఈ సంఘటనలో, ఎన్టీఆర్ అభిమానులు కోట శ్రీనివాసరావును చుట్టుముట్టి దాడి చేయడానికి ప్రయత్నించారు. ఈ ఘటన ఆయనకు చేదు అనుభవంగా మిగిలింది. కోట తనను ఎందుకు టార్గెట్ చేస్తున్నారని బాధపడినట్లు పలు సందర్భాల లో చెప్పుకొచ్చారు.





Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: GATTIMI SATISH KUMAR, RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443365